ప్రజాశక్తి
సోమవారం 11 మార్చి, 2024
5
శ్రీకాకుళం



నేడు స్పందన రద్దు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 11న నిర్వహించాల్సిన స్పందన రద్దయిందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని, అందువల్ల ఈ వారం స్పందన రద్దు చేస్తున్నట్టు తెలిపారు. ఫిర్యాదుదారులు ఈ వారం జిల్లా పరిషత్‌కు రానవసరం లేదన్నారు.

పోలీసు స్పందన కూడా...

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారమూ నిర్వహించే పోలీసు స్పందన కార్యక్రమం ఈ నెల 11న నిర్వహించడం లేదని ఎస్‌పి జి.ఆర్.రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం జలుమూరు మండలం శ్రీముఖలింగేశ్వర స్వామి చక్రతీర్థ స్నానాల్లో పోలీస్ అధికారులు బందోబస్తు విధుల్లో పాల్గొనున్నారని అన్నారు. అందుకు స్పందన కార్యక్రమం రద్దు చేస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

ఉద్యోగుల పక్షపాతిగా ఉంటాం

- ఎపి ఎన్‌జిఒల సమావేశంలో రెవెన్యూ మంత్రి ధర్మాన
- ఘనంగా పురుషోత్తం నాయుడు అభినందన సభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో ప్రస్తుతం సంస్కరణల ప్రభుత్వం నడుస్తోందని, ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి లోతైన ఆలోచనలతో మార్పుల కోసం ప్రయత్నిస్తున్నారని, ఆయన ఆలోచనలను అమలు చేయాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కొత్తగా ఎన్నికైన కె.వి.శివారెడ్డి, చౌదరి పురుషోత్తం నాయుడుల సన్మానసభ నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా నగరంలోని ఆర్చి కూడలి నుంచి వారికి స్వాగతం పలుకుతూ ఉద్యోగులు బైక్ ర్యాలీ చేపట్టారు. అద్యంతరం ఉద్యోగులు వారికి బ్రహ్మరథం పట్టారు. ర్యాలీ పాలకొండ రోడ్డు, కళింగ రోడ్డు, పాతబస్టాండ్, పొట్టిశ్రీరాములు జంక్షన్ మీదుగా జిల్లా పరిషత్‌కు చేరుకుంది. దారి పొడుగునా వారికి నగర వాసులు స్వాగతించారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో



మాట్లాడుతున్న రెవెన్యూ ప్రసాదరావు


అభినందన సభ జరిగింది. ఈ సభకు మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చౌదరి కుటుంబంతో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన తాత చౌదరి సత్యనారాయణ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని అనంతరం శాసన సభ్యునిగా సాధారణ జీవితాన్ని గడిపిన వ్యక్తి అన్నారు. అలాగే తండ్రి చౌదరి తేజేశ్వరరావు వామపక్ష భావజాలాన్ని పుణికిపుచ్చుకుని జీవిత కాలం ప్రజాపోరాటాల్లో ఉన్నారన్నారు. వారి వారసత్వంగా పురుషోత్తం నాయుడు ఉద్యోగుల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ ఉత్తరాంధ్ర నుంచి మొట్టమొదటి సారి ఉద్యోగుల సంఘానికి రాష్ట్రస్థాయిలో నాయకత్వ బాధ్యతలను చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. సమస్యల సాధనకు మెతక వైఖరి సరికాదని, గర్జించి మాట్లాడేలా పురుషోత్తం నాయుడు శైలి మార్చుకోవాలని హితవుపలికారు. ఉద్యోగులు ప్రభుత్వంలో ఎల్లప్పుడు భాగమేనని, ఆ దిశగా సహకారాన్ని అందించాలని మంత్రి కోరారు. అనంతరం మంత్రి ధర్మానను ఎపిఎన్‌జిఒ రాష్ట్ర నాయకులు గజమాలతో సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి, నూతన అధ్యక్షులు కె.వి.శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడులు మాట్లాడారు. ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం అధ్యక్షతన నిర్వహించిన కార్యయక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న రెవెన్యూ మంత్రి ప్రసాదరావు

'ప్రజాశక్తి' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

శ్రీకాకుళం అర్బన్ : ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చౌదరి పురుషోత్తం నాయుడు ఎన్నికై తొలిసారి శ్రీకాకుళం వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన విజయాలపై 'ప్రజాశక్తి' ప్రత్యేక సంచికను ప్రచురించింది. ఈ ప్రత్యేక సంచికను జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖరరెడ్డి, ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, పురుషోత్తం నాయుడు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు, ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ మేనేజర్ కామినాయుడు, వాసు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గజమాలతో సన్మానిస్తున్న ఎన్‌జిఒ నాయకులు

మన్యం బంద్ ప్రశాంతం

ప్రజాశక్తి- కొత్తూరు

ఆదివాసీ నిరుద్యోగులను ఆదుకోవడానికి స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని గొట్టిపల్లిలో మన్యం బంద్‌లో భాగంగా ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుకున్న గిరిజనుల అందరికీ ఉద్యోగులు ఇవ్వాలన్నారు. ఇటీవల విడుదల చేసిన డిఎస్‌పి నోటిఫికేషన్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడంతో ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలన్నారు. సాగులో ఉన్న ఆదివాసుల భూములకు పోడు పట్టాలు ఇవ్వాలన్నారు.

జిల్లాలో నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లోకి చేర్చాలన్నారు. మాతృభాష వాలంటీర్లను మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కొనసాగించి జీతాలు చెల్లించాలన్నారు. వాలంటీర్లను రెగ్యులర్ చేసి కనీస వేతనం అమలు



మందస : ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు



కొత్తూరు : ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు

చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆరిక శివ, ఆరిక సింహాచలం, గేదెల ధర్మారావు, గేదెల అనిల్‌కుమార్, నిమ్మక, పార్వతి, ఆరిక సావిత్రమ్మ, నిమ్మక రామారావు పాల్గొన్నారు.

మందస : మన్యం బంద్‌లో భాగంగా మందసలో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. గిరిజన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు సవర గురునాథ్, సవర ధర్మారావు మాట్లాడుతూ ప్రస్తుతం గిరిజనులకు ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ వేసి నియామకాలు చేపట్టాలన్నారు. జిఒ నంబరు 3 పునరుద్ధరణకు ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయాలని, ఆదివాసీ మాతృభాష విద్యా వాలంటీర్లను కొనసాగించాలన్నారు. ఏజెన్సీల్లో వంద శాతం ఉద్యోగాలు ఆదివాసీలకే కేటాయించాలన్నారు. మండలంలోని గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాల్లో చేర్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.ధర్మారావు, కార్మిక సంఘాల నాయకులు, పి.దేవేంద్ర, ఎస్.ఫాల్గుణరావు, ఎస్.భావన్న, ఎస్.భాస్కరరావు, ఎ.కృష్ణారావు, పి.అప్పలస్వామి పాల్గొన్నారు.

24న రాష్ట్రస్థాయి విద్యా సదస్సు

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, యుటిఎఫ్ వ్యవస్థాపక స్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి స్మారక రాష్ట్రస్థాయి విద్యా సదస్సు శ్రీకాకుళంలో ఈ నెల 24న నిర్వహిస్తున్నట్టు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎల్.బాబూరావు అధ్యక్షతన ఆఫీసు బేరర్స్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏకపక్ష నిర్ణయాలు, నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా తెలుగుజాతి ఐక్యతకు చిహ్నంగా యుటిఎఫ్ స్థాపనలో క్రియాశీలకంగా పనిచేసిన ఆదర్శ జీవి ఎవిఎస్ అని కొనియాడారు. నాటి రోజుల్లో ఉద్యోగులకు సంఘం పెట్టుకొనే హక్కు లేదని, ప్రభుత్వ నిర్బంధాలను ఎదిరించి రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మలచడంలో కీలక భూమిక పోషించారని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాలు విద్య ప్రయివేటీకరణ వైపు వెళ్లే విధానాలు, సంస్కరణలు ప్రవేశపెడుతున్నాయని విమర్శించారు. దేశ, రాష్ట్ర అవసరాలకు అనువైన విద్యను కాదని, ప్రపంచ అవసరాలు తగ్గట్టుగా సంస్కరణలు ప్రవేశ పెట్టడం దేశానికి నష్టదాయక మన్నారు. ఆర్థిక రంగంలో అభివృద్ధి కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే విధానాలు అమలు చేస్తున్నారన్నారు. దీనివల్ల ఉత్పత్తిలో భాగస్వామ్యంగా ఉన్న ప్రజలకు సంపద అందకుండా పోతోందని, దీనివల్ల ఆర్థిక సంక్షోభం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ విద్య ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల కోట్లకు పైగా చెల్లించాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. వాటిని చెల్లించకపోవడం దారుణమన్నారు. 12వ పిఆర్‌సి కమిటీ వేసి 30 శాతం ఐఆర్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ యుటిఎఫ్ చేపట్టిన ఓట్ ఫర్ ఓపిఎస్‌ని విస్తృతంగా ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యుటిఎఫ్ సహాధ్యక్షులు బి.ధనలక్ష్మి, దాలయ్య, రవికుమార్, హనుమంతు అన్నాజీరావు, సూర్యప్రకాష్, శారద, స్వర్ణకుమారి, రమణ, మురళీధర్, గౌరీశ్వరావు, శంకరరావు, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

13న అరుణాచారి స్థూపావిష్కరణ



మాట్లాడుతున్న గోవిందరావు

సోంపేట : తొలితరం కమ్యూనిస్టు, యావత్ జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన పోరాటయోధుడు గానుగుల అరుణాచారి స్థూపావిష్కరణ ఈ నెల 13న మండలంలోని మామిడిపల్లి వద్ద చేపడుతున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, మండల కన్వీనర్ ఎస్.లక్ష్మీనారాయణ, గానుగులు తరుణాచారి విజ్ఞాన కేంద్రం ప్రెసిడెంట్ జుత్తు సింహాచలం, గౌరవ అధ్యక్షులు పాతిని కృష్ణమూర్తి మాస్టారు తెలిపారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారంమాట్లాడారు. ఈ స్థూప ఆవిష్కరణ కార్యక్రమానికి సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి.మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ పాల్గొంటారని అన్నారు. మామిడిపల్లిలో సుందరయ్య విగ్రహానికి పూలమాలు వేసి అక్కడి నుంచి స్థూపం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తామని అన్నారు. మార్పు పద్మానాభం, గానుగుల తరుణాచారి, బెండాళం గవరయ్య, రాంబుడ్డి సారథి, తెప్పల సారథి తదితరులు స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని కడలూరు జైళ్లకు వెళ్లారని అన్నారు. అక్కడ కమ్యూనిస్టు నాయకుడు ఎ.కె.పద్మనాభంతో పరిచయం ఏర్పడి కమ్యూనిస్టులుగా తయారై గ్రామాలకు వచ్చారని అన్నారు. జమిందారి వ్యతిరేఖ ఉద్యమంలో పాల్గొని, చివరి వరకూ కమ్యూనిస్టు ఆశాయాలకు అనుగుణంగా పనిచేశారని కొనియాడారు. సమావేశంలో కర్రి సింహాచలం తెప్పల పాపారావు, ఎన్.గణపతి పాల్గొన్నారు.

కార్యకర్తల వల్లే ఇబ్బంది

- విభేదాలు వీడితేనే గెలుపు
- రెడ్డిక ఆత్మీయ సమావేశంలో రెవెన్యూ మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నియోజకవర్గంలో ప్రస్తుతం తనకు గడ్డు కాలం ఉందని, అది కార్యకర్తల వల్లే ఏర్పడిందని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వ్యాఖ్యానించారు. గార మండలం అంపోలు సమీపాన ఆదివారం నిర్వహించిన రెడ్డిక సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో కార్యకర్తల విభేదాల వల్లే ప్రజలు నాపై కోపం పెంచుకుంటున్నారని అన్నారు. దీనివల్ల నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. జిల్లాలో అనేక సామాజిక తరగతులకు శాసనసభ్యులుగా పదవులు ఇస్తున్నామని, రెడ్డిలకూ ఒక స్థానం ఇవ్వాలని సిఎం జగన్మోహన్‌రెడ్డిని కోరినట్టు వివరించారు. అయితే ఇచ్ఛాపురంలో మహిళ టిక్కెట్ ఇవ్వాలని అప్పటికే నిశ్చయించుకున్నట్టు చెప్పారన్నారు. 2026లో నియోజకవర్గాల పునర్విభజన లో 175 నియోజకవర్గాలు 225 స్థానాలకు పెరుగుతుందని, అప్పుడు తప్పకుండా రెడ్డిలకు జిల్లాలో అవకాశం దక్కుతుందని అన్నారు. ఎప్పుడూ శాసనసభలో చంద్రబాబును నిలదీస్తానని, అందుకే ఆయన నాపై ఎన్నో తప్పుడు ఆరోపణలు చేస్తుంటారని అన్నారు. ఏది ఏమైనా వైసిపి అధికారంలో ఉండడం మనకు అవసరం, ఆవశ్యమన్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నంలో రెడ్డి సామాజిక భవన నిర్మాణానికి స్థలం కోరినా సాధించలేకపోయామన్నారు. శ్రీకాకుళం రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు సామాజిక తరగతి భవనం నిర్మాణానికి స్థలం సాధించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ దూడ విష్ణుమూర్తి, బొత్స రామకృష్ణారెడ్డి, బల్లాడ జనార్ధనరావు, ఎపి నెడ్‌క్యాప్ కార్పొరేషన్ డైరక్టర్ అలనాన త్రినాథరెడ్డి, బాకి వేణుగోపాలరావు, ప్రొఫెసర్ తాతారెడ్డి, దుక్క రాజశేఖరరెడ్డి, బుచ్చ రామకృష్ణారెడ్డి, అలపాన అప్పోజీరెడ్డి, బస్వా రాజేష్‌రెడ్డి, పడపాన సుగుణారెడ్డి, బాకి వేణుగోపాలరెడ్డి, మురళీరెడ్డి పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆటలు అవసరం

ఎస్‌పి జి.ఆర్ రాధిక



ట్రోఫీని అందజేస్తున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి- మెళియాపుట్టి

విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు ఎంతో అవసరమని ఎస్‌పి జి.ఆర్.రాధిక అన్నారు. మండలంలోని చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కమ్యూనిటీ పోలీసింగ్ ఆధ్వర్యాన ఆదివారం వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెడు అలవాట్లకు బానిస కావద్దని, ఈవ్‌టీజింగ్ చేయకూడదని సూచించారు. ఆటలు ఆడుకోవడం వల్ల ఆరోగ్యంతో పాటు ఉల్లాసంగా ఉంటారని అన్నారు. ఏదైనా ఆపద వచ్చినప్పుడు కాల్ చేస్తే పోలీసులు అండగా ఉంటారని అన్నారు. ప్రతి వ్యక్తి దగ్గరా పోలీస్ కంట్రోల్ నంబరు ఉంచుకోవాలన్నారు. నేరం జరిగినప్పుడు పోలీసులకు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసానిచ్చారు. నేరం జరిగినప్పుడు దిశ యాప్ ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ సందర్భంగా వాలీబాల్ విన్నర్‌గా చాపర గ్రాండ్ జట్టు విన్నర్ గెలుపొందారు. మెళియాపుట్టి యూత్ జట్టు క్రికెట్ విన్నర్‌గా, పెద్దమడి స్కూలు రన్నర్‌గా, చాపర గ్రాండ్ జట్టు క్యారమ్స్, విన్నర్‌గా ఎస్‌సి బాలురు హాస్టల్ జట్టులకు ఎస్‌పి బహుమతులను అందజేశారు. అలాగే గ్రంథాలయాలకు కాంపిటేటివ్ మెటీరియల్, పోలీస్ స్టేషన్‌ను కమ్యూనిటీ భవనాలకు వాటర్ ప్యూరిఫైయర్ పరికరాలు అందజేశారు. అలాగే పలువురికి క్రీడా కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి డిఎస్‌పి డి.బాలచంద్రారెడ్డి, కొత్తూరు పాతపట్నం సిఐలు ఆర్.వేణుగోపాలరావు, నల్లి సాయి, మెళియాపుట్టి, పాతపట్నం, కొత్తూరు ఎస్ఐలు టి.రాజేష్, పోలీస్ సిబ్బంది, పీడీలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కొత్తూరు : గిరిజనులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించుకుని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎస్‌పి జి.ఆర్.రాధిక అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా లబ్బ గిరిజన గ్రామంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో ప్రశాంతంగా ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు రాంబాబు, సిబ్బంది 500 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన వాలీబాల్ పోటీలో మతాల జట్టు వినర్‌గా, నివగాం జట్టు రన్నర్‌గా నిలిచారు. వీరికి ట్రోఫీలు, కిట్లు, క్రీడా దస్తులను అందజేశారు. కార్యక్రమంలో టెక్కలి డిఎస్‌పి బాబచంద్రారెడ్డి, సిఐ ఆర్.వేణుగోపాలరావు, ఎస్ఐలు ఎం.ఎ.అహ్మద్, నారాయణస్వామి, సర్పంచ్ ప్రతినిధి తులసీదాసు పాల్గొన్నారు.

పొందూరు ఖాదీకి ప్రత్యేక కళ

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ఖాదీ ఒక ప్రత్యేక కళని, ఖాదీని చేనేతతో పోల్చకుండా ఖాదీని ప్రభుత్వాలు ప్రత్యేకంగా గుర్తించాలని ఇంటాక్ (భారతీయ జాతీయ కళలు సాంస్కృతిక వారసత్వ సంస్థ) కన్వీనర్ నూక సన్యాసిరావు అన్నారు. ఒన్ డిస్ట్రిక్ట్ - ఒన్ ప్రొడక్టకు ఎంపికైన పొందూరు ఖాదీ అభివృద్ధికి పాల్పడుతున్న ఏఎఫ్‌కేకే సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామేశ్వరప్రసాద్, దండా వెంకటరమణలను ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు. పొందూరు ఖాదీ వారసత్వసంపదని, దానిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. ఖాదీని చేనేతతో పోల్చడంతో సరికాదన్నారు. అవార్డులతో ఖాదీని అభివృద్ధి చేయలేరని, ఖాదీకి మూలాధారమైన ఖాదీదారం నేసే వడుకు కార్మికులు, నేత కార్మికుల జీవన ప్రమాణాలు పెంచడం ద్వారా మాత్రమే అభివృద్ధి సాధ్యమని ఇంటాక్ కో-కన్వీనర్ వావిలపలి జగన్నాథాయుడు అన్నారు. ఖాదీని అభివృద్ధి పరిచేందుకు అవసరమైన సూచనలు, సలహాలు ప్రభుత్వానికి అందిస్తామన్నారు. ఖాదీని వ్యాపారంగా అభివృద్ధిపరుస్తున్న ఏఎఫ్‌కేకే సంఘాన్ని వ్యాపార సంస్థగా పరిగనించకుండా ప్రభుత్వసంస్థగా గుర్తించి తగిన సహకారాలు అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచిస్తామన్నారు. సంస్థ అభివృద్ధికి కావాల్సిన రుణాలను నాబార్డు సంస్థద్వారా తప్పకుండా అందించే ఏర్పాట్లు చూస్తామని చెప్పారు. అనంతరం ఏఎపికేకే సంఘం అధ్యక్ష, కార్యదర్శులను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇంటాక్ మాజీ కన్వీనర్ కె.వి.జె.రాధాప్రసాద్, మాజీ కో-కన్వీనర్ సురంగి మోహనరావు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఇంటాక్ ప్రతినిధులు

చక్రతీర్థ స్నానాలకు నీరు విడుదల

వంశధార ఉప కార్య నిర్వాహక ఇంజినీర్ అనిల్‌కుమార్

జలుమూరు: మండలంలోని శ్రీముఖలింగేశ్వర స్వామి క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 11న చక్రతీర్థ స్నానానికి శనివారం 80 క్యూసెక్కులు, ఆదివారం మరో 150 క్యూసెక్కులు నీటిని విడుదల చేశామని వంశధార ఉపకార్య నిర్వాహక ఇంజినీర్ వై.అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వంశధార నదిలో మిరియాబిల్లి రేవు వద్ద సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఈ వేడుక చక్రతీర్థ స్నానాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే నదిలో బారికేడ్లు సిద్ధం చేశారు. శనివారం నాటికి ఏర్పాట్ల ప్రదేశంలో నీరు లేదు. లక్షలాది మంది హాజరై పుణ్యస్నానాలు చేయనున్న నేపథ్యంలో నీరు విడుదల చేసి యాత్రికులకు ు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చక్రతీర్థ స్నానాలకు అనువుగా నదీ ప్రవాహంలో నీరు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.



నదిలో ప్రవహిస్తున్న నీరు

నీటిఎద్దడి నివారణకు చర్యలు

- పథకాలు, బోర్లు అత్యవసర మరమ్మతులు
- ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ టి.శ్రీనివాసప్రసాద్

జిల్లాలో రానున్న వేసవిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి చర్యలు చేపడుతున్నట్టు గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్ఇ టి.శ్రీనివాసప్రసాద్ తెలిపారు. గిరిజన ప్రాంతాల్లోను, తీర ప్రాంత గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రత అధికంగా ఉంటుందన్నారు. మైదాన ప్రాంతంలో భూగర్భజలాలు అడుగంటిన ప్రాంతాల్లో సైతం నీటి ఎద్దడి సమస్య ఎదురవుతున్న గ్రామాలను గుర్తించి అక్కడ అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. తీర ప్రాంత గ్రామాల్లో వేసవిలో బావులు, బోర్లలో ఉప్పనీరు చేరుతున్నట్టు ఫిర్యాదులు ఉన్నాయని, అటువంటి ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. ఉద్దానం వాటర్ స్కీం, జలజీవన్ మిషన్ వల్ల అనేక గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణ సాధ్యమవుతోందన్నారు. ప్రాజెక్టు పరిధిలో లేని గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. నీటిఎద్దడి నివారణకు చేపడుతున్న చర్యలపై ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

? జిల్లాలో ఈ ఏడాది వేసవి ముందస్తు ప్రణాళికలు ఎలా ఉన్నాయి?

గతేడాది ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు కొంతమేరకు తగ్గుతున్నాయి. దీనివల్ల తాగునీటి ఎద్దడి తలెత్తే పరిస్థితి ఎదురవుతుందని అంచనా వేశాం. ఆ దిశగా ఎద్దడి నివారణ చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. వంశధార నది నుంచి ఉద్దాన ప్రాంతంలో ఉన్న మండలాలకు తాగునీటి సరఫరా అవుతుండడంతో ఎక్కువ గ్రామాలకు నీరు అందివ్వగలుగుతున్నాం. ఏజెన్సీ మండలాల్లో తాగునీటి ఎద్దడి వేసవిలో పెరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది భూగర్భ జలాల ఆధారంగా నీటిఎద్దడి తీవ్రతను అంచనా వేస్తున్నాం. ఆ దిశగా గ్రామాలను గుర్తించి ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం. గ్రామాల్లోని పాత స్కీమ్‌లను అత్యవసరంగా మరమ్మతు పనులు చేపట్టడం జరుగుతోంది. మరోవైపు బోర్లు మరమ్మతు పనులు చేపడుతున్నాం. జలజీవన్ పథకం ద్వారా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

? ఉద్దానం ప్రాజెక్టు వల్ల ఏయే ప్రాంతాలకు నీటిఎద్దడి నివారించ గలుగుతున్నారు?

జిల్లాలో అత్యధిక మండలాల్లో తాగునీటి అవసరాలు తీర్చడానికి వీలుగా ప్రభుత్వం రూ.700 కోట్లతో సమగ్ర తాగునీటి ప్రాజెక్టును పూర్తి చేశాం. వంశధార నది నీటిని తాగునీటి అవసరాల కోసం వినియోగించుకునేందుకు ఈ ప్రాజెక్టు రూపకల్పన చేశాం. హిరమండలం రిజర్వాయరు వద్ద ఇంటేక్ వెల్ నిర్మించి అక్కడ నుంచి పైపులైన్ ద్వారా వజ్రపుకొత్తూరు మండలంలో 121 గ్రామాలు, పలాసలో



శ్రీనివాసప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ



86 గ్రామాలు, మందసలో 225 గ్రామాలు, సోంపేటలో 74 గ్రామాలు, కవిటిలో 118 గ్రామాలు, కంచిలిలో 138 గ్రామాలు, ఇచ్ఛాపురంలో 45 గ్రామాలకు తాగునీరు అందించడం జరుగుతోంది. ఏడు మండలాల పరిధిలో 807 గ్రామాలకు తాగు నీటి అవసరాలు తీరనున్నాయి.

? ఈ ప్రాజెక్టు ద్వారా ఎంత నీటిని సరఫరా అవుతోంది?

ఈ ప్రాజెక్టు వల్ల ఏడాదికి 1.12 టిఎంసి తాగునీరు ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఉపయోగించుకునే వీలుంది. రోజూ నిరంతరాయంగా సరఫరాకు వీలు కలిగింది. 16 ప్రదేశాల్లో ఓవర్ హెడ్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, 23 ప్రదేశాల్లో గ్రౌండు లెవెల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు చేపట్టాం. మెళియాపుట్టి మండలం మాకన్నపురం, పలాస మండలం టెక్కలిపట్నం వద్ద హెడ్ వర్కులతో పాటు 1062 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేసి 51 సంపులకు నీటిసరఫరా చేస్తున్నాం. పాతపట్నం నియోజకవర్గం పరిధిలో మరికొన్ని గ్రామాలకు ఈ ప్రాజెక్టును విస్తరించారు. ఈ పనులు పూర్తయితే జిల్లాలో దాదాపు సగానికి పైగా గ్రామాల్లో నీటిఎద్దడి నివారించడానికి వీలువుతుంది.

? జల జీవన్ మిషన్ పనులు ఎంతమేరకు పూర్తయింది?

గ్రామాల్లో ఓవర్ హెడ్ టాంకులు ఉండి కుళాయి కనెక్షన్ ఇచ్చే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పనులు త్వరితగతిన పూర్తి చేశాం. జలజీవన మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి వేయాలన్నదే లక్ష్యం. అందుకోసం జిల్లాలో 721 గ్రామాలను ఎంపిక చేసిన ప్రభుత్వం జలజీవన మిషన్ ద్వారా పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. 2024 చివరినాటికి 4.36 లక్షల ఇళ్లకు కుళయి కనెక్షన్లు ఇవ్వాలన్నది లక్ష్యం. వీటిని తాగునీటి పథకాలకు అనుసంధానించడం ద్వారా ఇంటికే శుద్ధ జలాన్ని అందించడానికి వీలవుతుంది. ఈ ఏడాది చివరి నాటికి జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి గృహానికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు శరవేగంగా పనులు పూర్తి చేస్తున్నాం. ఈ పనులు పూర్తయితే ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వీలవుతుంది.

ప్రజాశక్తి
www.prajasakti.com

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- రణస్థలం

మహిళల ఆర్థిక అభివృద్ధే జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన చేయూత నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని చెక్కులను మహిళలకు అందజేశారు. ముందుగా దివంగత నేత రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సమగ్రాభివృద్ధికి, సాధికారతకు, మహిళల సుస్థిర జీవనోపాధికి చేయూత పథకం ఉపయోగపడుతుందన్నారు. సంక్షేమ పథకాల సహాయంతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ప్రభుత్వం సహకారం అందజేస్తుందని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, రణస్థలం మండల ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, వైస్ ఎంపిపి రాయపురెడ్డి భుజంగరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు సంఘం అధ్యక్షులు రెడ్డి విశ్వేశ్వరరావు, మహంతి చిన్న రామునాయుడు, నాయకులు గొర్లె అప్పలనర్సునాయుడు, గొర్లె అప్పలనాయుడు పాల్గొన్నారు.



సచివాలయ భవనం ప్రారంభంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్ తదితరులు

పోర్టులో ఉద్యోగావకాశాలు కల్పిస్తాం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టెక్కలి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో చదువుకొని ఉన్న ప్రతి నిరుద్యోగికి మూలపేట పోర్టులో ఉద్యోగ అవకాశాన్ని కల్పిస్తానని ఎమ్మెల్సీ, నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలో ఎత్తురాళ్లపాడు పంచాయతీలో రూ.17లక్షలతో నిర్మించిన డిజిటల్ లైబ్రరీ, శ్రీజగన్నాథపురం పంచాయతీలో గ్రామ సచివాలయం, డిజిటల్ లైబ్రరీ, కురుడు పంచాయతీలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, దంత పంచాయతీలో రూ.14 కోట్లతో రైతు భరోసా కేంద్రం, బిసి కమ్యూనిటీ హాల్, పలు రోడ్లు, పలు భవనాలను ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావుతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు జగన్‌మోహన్‌రెడ్డిపై గెలవలేక పవన్ కళ్యాణ్, మోదీలతో కలిసి ఎన్నికల్లో పోటీకి వస్తున్నాడన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, జెసిఎస్ కన్వీనర్ గద్దలలు నాగభూషణరావు, వైసిపి నాయకులు కవిటి రామరాజు, తలగాన గణపతిరావు, గురువెల్లి కేశవరావు, బగాది దివాకర్, పూజారి సత్యం, బొడ్డ అప్పన్న, మెట్ట సింహాచలం పాల్గొన్నారు.



కిట్లును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శాంతి

న్యూట్రిషన్ ఫుడ్ కిట్లు పంపిణీ

పాతపట్నం: మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు న్యూట్రిషన్ ఫుడ్ కిట్లును ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని, ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను పొందాలన్నారు. ఈ పౌష్టికాహారం తీసుకోవడం వలన వ్యాధిగ్రస్థుల జీవనకాలం పెరుగుతుందన్నారు. డిఆర్‌పి నాగభూషణం మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపరాదన్నారు. కార్యక్రమంలో వైద్యులు శివ కుమార్, గ్రీష్మ, ఐసిటివి కౌన్సిలర్లు జి.బాబురావు, త్రివేణి, సూపర్‌వైజర్లు పి.సుధాకర్, చింతడ ప్రసాద్, సిఎల్‌డబ్ల్యుకె శ్రీనివాసరావు, ఎల్.సర్వేశ్వరరావు, కె.లత, ఎంఎస్‌ఎంయు డైరెక్టర్ ఎరుకల వెంకటరమణ, ఎఎంసి చైర్మన్ అర్జునరావు పాల్గొన్నారు.

'జీడి' మహాధర్నాను జయప్రదం చేయాలి

పలాస : కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు జీడి రైతుల సంఘం, వామపక్షాల ఆధ్వర్యంలో జీడికి మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ చేపడుతున్న జీడి మహాధర్నాను విజయవంతం చేయాలని జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ కోరారు. మందస మండలం గుడ్డిభద్ర, చిన్న కేశుపురం, పెద్ద నారాయణపురం, టి.గంగువాడ, అంబుగాం, లింబుగాం, పెద్ద లోహరిబంద తదితర గ్రామాల్లో పర్యటించి జీడి గిట్టుబాటు ధర కల్పించాలని చేపట్టనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిపిక్కల 80 కేజీల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించి ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ రైతు ఉద్యమ స్ఫూర్తితో పలాస కాశీబుగ్గ పట్టణంలో జరుగుతున్న ఈ మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు టి.భాస్కరరావు, కొర్ల హేమారావు చౌదరి, ఎం.రామారావు, జి.బాలకృష్ణ, కీలు తవిటయ్య, బాబూరావు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే లక్ష్యం

వజ్రపుకొత్తూరు: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మా లక్ష్యమని ఉద్దానం అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు తామాడ లక్ష్మణరావు అన్నారు. కంబాలరాయుడు పేటకు చెందిన పత్రి వెంకటరమణ కొన్నాళ్ళుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. వారికి ఇద్దరు పిల్లలు, నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న సొసైటీ సభ్యులు ఆదివారం కంబాల రాయడుపేటలో బాధితుడి స్వగృహం వద్ద కలిసి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. బాధితుడు బొంతలు కుట్టుకొని జీవనం సాగించేవాడు. క్యాన్సర్ కారణంగా జీవనోపాధి కోల్పోయి రోజు గడవడమే కష్టతరంగా మారిందని బాధితుడు తమ వద్ద వాపోయినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు మండల మహేష్, చింత దానేష్, చింత మహేష్, దండుపాటి పవన్ కుమార్, గీత నీలకంఠ, బత్తిని గణేష్, కొంకి మోహిని, చింత రూపావతి, బాలక సౌదామని, శారద పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

తర్లాకోట సచివాలయ ఉద్యోగుల లీలలు

- అర్హునికి మొండిచేయి
- అనర్హుడి ఖాతాకు రూ. 90 వేలు జమ!

ప్రజాశక్తి- పలాస

మండలం తర్లాకోట గ్రామ సచివాలయ ఉద్యోగి నిర్లక్ష్యం వలన పేద గిరిజనుడికి అన్యాయం జరిగింది. దానగోరకు చెందిన జగనన్న కాలనీ ఇళ్ల లబ్ధిదారుడికి సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుడు మొండి చేయి చూపారు. లబ్దిదారుడికి మంజూరైన సొమ్ము వేరొకరి ఖాతాకు జమ చేసి నిజమైన లబ్దిదారుడికి అన్యాయం చేశారు. సిఎం జగన్ ఆశయానికి తూట్లు పొడిచి నిరుపేద గిరిజనుడు కట్టుకుంటున్న గూడుకు బిల్లులు చెల్లించకుండా అనర్హుడికి సొమ్ములు ముట్టజెప్పి తన వాటా సొమ్ము కమీషన్ రూపంలో నొక్కేసిన సచివాలయ ఉద్యోగి తీరుపై బాహాటంగా విమర్శలు వినిపిస్తున్నాయి. మండలం దానగొర గిరిజన గ్రామానికి చెందిన సవర ఆనంద్‌కు 2022లో జగనన్న కాలనీలో ఇళ్ల స్థలం మంజూరైంది. ఆనంద్ భార్య కవితతో కలిసి కూలీ పనులతో వచ్చిన డబ్బులతో జీవనం సాగిస్తున్నారు. జగనన్న కాలనీలో ఇళ్ల స్థలం మంజూరైన నేపథ్యంలో అప్పులు చేసి పునాదులు వేసుకున్న ఆనంద్ కుటుంబం హౌసింగ్ స్కీం కింద తనకు మంజూరైన మొదటి విడత బిల్లు తన ఖాతాలో జమ చేయాలని తర్లాకోట గ్రామ సచివాలయ ఉద్యోగిని సంప్రదించారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లబ్దిదారుల వివరాలకు సంబంధించి పత్రాలు తీసుకుని శ్లాబ్ మట్టం వరకు నిర్మాణం చేసిన తర్వాత వస్తే ఎస్టిమేషన్ వేసి తొలి, మలి విడత బిల్లులు ఖాతాలో జమ చేస్తామని చెప్పి పంపించేశారు. శ్లాబ్ వరకు నిర్మించి బిల్లులు కోసం రెండేళ్లుగా తర్లాకోట గ్రామ సచివాలయ ఉద్యోగి చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా బిల్లులు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తునే ఉన్నారు. ఈ నేపథ్యంలో హౌసింగ్ బిల్లుల కోసం సచివాలయ ఉద్యోగి దగ్గరకు వెళ్లిన లబ్దిదారుడికి బిల్లులు ఖాతాలో జమ అవుతాయని, అస్తమానం సచివాలయానికి రావొద్దని



జగనన్న ఇల్లు (ఇన్‌సెట్‌లో బాధితుడు ఆనంద్)

సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆదేశించారని బాధితులు తెలిపారు. ఇళ్ల నిర్మాణం కోసం అప్పులు ఊబిలో కూరుకు పోయిన లబ్దిదారుడు ఆనంద్ కొంత కాలం వేచి చూసి శ్రీకాకుళంలోని హౌసింగ్ శాఖకు వెళ్లి తన గోడు వినిపించారు. అక్కడి అధికారులు రికార్డులు తనిఖీలు చేసి సమగ్రంగా విచారణ చేయగా పలాస మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సవర ఆనంద్ ఖాతాకు తన ఇళ్ల నిర్మాణం బిల్లులు జమ అయినట్లు గుర్తించారు. ఈ విషయమై లబ్దిదారుడు సచివాలయ ఉద్యోగిని బిల్లుల విషయమై నిలదీశారు. అనర్హుడి ఖాతాలో జమ చేసిన సొమ్ము రికవరీ చేయాల్సిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ తనకేమీ సంబంధం లేదని చేతులెత్తేయడంతో బాధిత లబ్దిదారుడు ఖంగుతిన్నాడు. తనకు తీరని అన్యాయం జరిగిందని తలచి ఆనంద్ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తనకు న్యాయం చేయాలని ఫిర్యాదుల రూపంలో విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా సచివాలయ ఇంజనీరింగ్ సహాయకుడు నిజమైన లబ్దిదారుడికి అన్యాయం చేసి స్వాహా చేసిన సొమ్మును ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుడితో కలిసి పంచుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సచివాలయ ఉద్యోగి కాసులకు కక్కుర్తిపడి అనర్హుడిని లబ్దిదారుడిగా చూపుతూ ఆధార్ సీడింగ్ చేసినట్లు తెలుస్తోంది. ఎటువంటి ఇంటి నిర్మాణం చేయని అనర్హుడి ఖాతాకు రూ. 90 వేలు జమ చేసిన తర్లాకోట గ్రామ సచివాలయ ఉద్యోగి రూటే సెప 'రేటు' అని కమీషన్ లేనిదే ఫైల్ కదలదనే విమర్శలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. సచివాలయ ఇంజనీరింగ్ సహాయకుడు పొరపాటు వలన ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుడి ఖాతాలో జమ చేసిన సొమ్ము తమకు ఇచ్చేయాలని బాధితుడు ఆనంద్ ప్రాధేయపడినప్పటికీ ఇవ్వకుండా ఆ ఒప్పంద ఉద్యోగి బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధిత లబ్దిదారుడు వాపోతున్నారు. తర్లాకోట గ్రామ సచివాలయ ఉద్యోగి చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినప్పటికీ అనర్హుడు నొక్కేసిన సొమ్మును వసూళ్లు చేయకుండా సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రెండేళ్లుగా జాప్యం చేస్తున్నారని బాధితుడు ఆనంద్‌తో పాటు కుటుంబీకులు ఆరోపించారు. ఇప్పటికైనా బిల్లులు చెల్లించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. హౌసింగ్ బిల్లుల సొమ్ము స్వాహా విషయమై హౌసింగ్ డిఇఇ కూడా అనర్హుడి నుంచి సొమ్ము రికవరీ చేసే బాధ్యత హౌసింగ్ ఎఇ. ఇంజనీరింగ్ సహాయకుడు వహించాలని ఆదేశించినట్లు సమాచారం. ఉపాధ్యాయుడు అకౌంట్‌లో జమైన సొమ్ము ఇవ్వనని నిరాకరిస్తే పోలీసులకు ఫిర్యాదు చేసి చట్ట పరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు బోగట్టా. ఈ విషయమై తర్లాకోట గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆరి వేంకటేశ్వర రావును వివరణ కోరగా జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణ బిల్లులకు సంబంధించి లబ్ధిదారుడైన సవర ఆనంద్ వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పెట్టామన్నారు. ఆధార్ నెంబర్ మాత్రం ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుడు ఆనంద్‌ది నమోదు చేసి పొరపాటు చేశానని అంగీకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఇంజనీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్ వెల్లడించారు.

గిరిజన గ్రామాల అభివృద్ధిపై దృష్టి



టిడిపి కండువ వేస్తున్న గౌతు శిరీష

ప్రజాశక్తి- నందిగాం

రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారం చేపట్టిన 60 రోజుల్లోనే గిరిజన గ్రామాల అభివృద్ధితో పాటు మెలియాపుట్టి, టెక్కలి మధ్య 30 ఎకరాల్లో ఐటిడిఎ ఏర్పాటు చేయిస్తామని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం మండలంలో మలియాలింగిపురంలో ఏర్పాటు చేసిన గిరిజన దండోరాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నందిగాం మండలం హర్షబాడ, దిమ్మిడిజోల, బడగాం, రథజనబొడ్డపాడు నుంచి వైసిపి నాయకులు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనను అంతం చేసే రోజులు త్వరలోనే వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పి.అజయ్ కుమార్, సలాన కృష్ణారావు, ఎం. బాలకృష్ణ, వెలమల విజయలక్ష్మి, అట్టాడ రవి ప్రసాద్, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని గోనెపాడు గ్రామ వైసిపి సర్పంచ్ బిర్లంగి అమ్మాయమ్మ, మరో 50 కుటుంబాలు టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి రవికుమార్ కండువాలను వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, కిల్లి సిద్ధార్థ, శివాల సూర్యం, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పైడి మురళీమోహన్, టిడిపి నాయకులు నందివాడ గోవిందరావు, సీపాన రామచంద్రమూర్తి, మణెమ్మ పాల్గొన్నారు.

పలాస: మందస మండలం గాంధ్రుగాంలో ఆదివారం 50 కుటుంబాలు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష సమక్షంలో టిడిపిలో చేరాయి. వారికి శిరీష పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టిడిపిలో చేరిన వారిలో సవర పుష్ప, యశోద, జ్యోతి, సోంబారి, కాంచన, విజయలక్ష్మి, రేవతి, అశ్వని, కుమారి, జమున, లక్ష్మీ, ఉష తదితరులున్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, రట్టి లింగరాజు, దాసరి తాతారావు పాల్గొన్నారు.

మండలంలోని రాజగోపాలపురంలో వైసిపి నుంచి 70 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారికి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి పి విఠల్‌రావు, టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ హేంబాబు చౌదరి, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్, మాజీ కౌన్సిలర్ పైల చక్రధర్, తమ్మినేని గంగారాం, జనసేన నాయకులు డాక్టర్ వి.దుర్గారావు, దువ్వాడ సంతోష్ కుమార్, బి.నాగరాజు, సప్ప నవీన్, వడ్డీ యాదగిరి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సోంపేట: మండలం ఎం.జి.పురం పంచాయతీ బకుడాలో ఆదివారం ఎమ్మెల్యే అశోక్ ఆధ్వర్యంలో సుమారు 100 కుటుంబాలు టిడిపిలో చేరాయి. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనకు వచ్చే ఎన్నికలతో ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సూరాడ చంద్రమోహన్, సదానందరావు, ఉత్తరాల బ్రహ్మానందం, మడ్డు రవికుమార్, చిత్రాడ శ్రీనివాసరావు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీని అందజేస్తున్న ఈశ్వరరావు

క్రీడలతో మానసికోల్లాసం

లావేరు: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని విజయనగరం జిల్లా బిజెపి అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. బెజ్జిపురంలో ఉమా రామలింగేశ్వర పంచాయతన దేవాలయ కమిటీ అధ్యర్యంలో ఏర్పాటు చేసిన మెగా వాలిబాల్ టోర్నమెంట్ నిర్వహించారు మూడు రోజుల పాటు నిర్వహించిన పోటీల్లో 30 జట్లు పాల్గొన్నారు. ఈ పోటీల్లో మూడు జట్లు గెలిపొందాయి. వారికి ఆదివారం బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఎన్ఇఆర్ మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఇజ్జడ శ్రీనువాసరావు, గంట్యాడ అప్పలనాయుడు, ఇజ్జడ అప్పారావు, మాజీ ఎంపిటిసి దన్నాన శ్రీనువాసరావు పాల్గొన్నారు.




చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న సర్పంచ్

చెత్త బుట్టల పంపిణీ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలం గోవిందపురం పంచాయతీలో సర్పంచ్ రెయ్యి రామిరెడ్డి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తడి చెత్త, పొడి చెత్త సేకరణ నిమిత్తం ప్రతి ఇంటికి రెండు చెత్త బుట్టలను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న ప్రజలు

రాపాకలో అన్నదానం

పొందూరు: మండలం రాపాకలో వరలక్ష్మి, షిరిడి సాయి బాబా ఆలయ చతుర్థ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన డీ, జోడి డాన్సులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు పటిష్ట చట్టాలు అవసరం

ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి

ప్రజాశక్తి- పలాస

మహిళలకు రక్షణ కల్పించి, వారి హక్కులు కాపాడాలంటే పటిష్టమైన చట్టాలు అవసరమని, ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి అల్లాడ లక్ష్మి అన్నారు. స్థానిక లిటిల్ ఎంజిల్స్ స్కూల్‌లో ఐద్వా, శ్రామిక మహిళ సంఘం ఆధ్వర్యాన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను కట్టు బానిసలుగా ఉండాలని శాశించే ఈ సమాజ రుగ్మతలకు వ్యతిరేకంగా మహిళలు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. దోపిడీ రూపాలను మార్చుకొని మహిళలను మరింతగా దోపిడీ చేస్తున్నరని ధ్వజమెత్తారు. శ్రామిక మహిళలు వెట్టిచాకిరీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను దోచుకునేందుకే అవకాశాలు కల్పిస్తున్నాయని, దోపిడీ దారులకు వత్తాసు పలుకుతున్నాయని విమర్శించారు. మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలన్నింటిలోనూ



మాట్లాడుతున్న లక్ష్మి

పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి మాట్లాడుతూ స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయడం ద్వారా ప్రభుత్వాలు మహిళలకు ఆర్థికచేయూత కల్పించి మహిళలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలు చైతన్య వంతమై పోరాడితే బానిస బంధాల నుంచి విముక్తి సాధించగలరని అన్నారు. ఆ దిశగా మహిళలు కథలాలి అన్నారు. పలాస మండల ఐద్వా కార్యదర్శి ఎన్.ఢిల్లేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో శ్రామిక మహిళలు ఆర్.అప్పలనరసమ్మ, కె.మహాలక్ష్మి, డి.సుందరి, పి.భూదేవి, బి.శకుంతల, వై.కాంచన, సుజాత, శ్రీదేవి, సరస్వతి పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

రక్తదానానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఉద్దానం హెల్పింగ్ సొసైటీ వ్యవస్థాపకులు కీలు విజయ్ కుమార్ కోరారు. ఆదివారం ఉద్దన గోపీనాథపురంలో ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసిన ప్రతి ఒక్కరూ ఇతరుల ప్రాణం నిలిపిన గొప్పవారవుతారన్నారు. తలసేమియా వ్యాధితో చిన్న పిల్లలు బాధపడుతున్నారని వారికి ఎప్పటికప్పుడు రక్తం అందించాల్సిన అవసరం ఉంటుందన్నారు. ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ (పలాస) సహకారంతో తలసేమియా పిల్లల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి 15 మంది రక్తదాతలు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సంతోష్, హారిక, కమల, సావిత్రి, హేమరావు, తిరుపతి, వాసు, మిన్నారావు, జగ్గారావు, తేజేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

పొందూరు: మండలం తోలాపిఎ సత్య సాయి సేవాసమితి ఆధ్వర్యంలో విజయఖ బ్లడ్ బ్యాంక్ (శ్రీకాకుళం) సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని సత్య సాయి సేవా సమితి



వజ్రపుకొత్తూరు : రక్తదానం చేస్తున్న యువకుడు

జిల్లా అధ్యక్షులు ఎన్ని లింగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 23 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ శిబిరంలో జిల్లా పదాధికారులు, జోనల్ పదాధికారులు, కన్వీనర్ జగన్మోహన్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: యువత రక్తదానం చేయడం వల్ల ఆరోగ్య వంతమైన జీవనాన్ని అలవర్చుకోవచ్చని న్యూ సెంట్రల్ స్కూల్ డైరెక్టర్ పి.శ్రీకాంత్ అన్నారు. నగరంలోని పిఎన్ కాలనీలో ఉన్న స్కూల్ 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 101మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు అభినందించారు. ఈ శిబిరంలో స్కూల్ డైరెక్టర్ పి.శ్రీదేవి, ప్రిన్సిపాల్ బి.మల్లేవ్వరరావు పాల్గొన్నారు.

కృపారాణిని కలిసిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

టెక్కలి రూరల్ : మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి క్యాంపు కార్యాలయంలో ఆదివారం జిల్లా అవుట్ సోర్సింగ్ బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రభుత్వం త్వరగా జరిపేలా కృషి చేయాలని వారు కోరారు. అనంతరం వినతిపత్రం అందించారు. అవుట్ సోర్సింగ్ క్రమబద్ధీకరణకు తనవంతు కృషి చేస్తానని కృపారాణి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.



పలాస : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డిఎస్‌పి

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

యువతకు చదువుతో పాటు క్రీడలు అవసరమని కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. కాశీబుగ్గ పోలీసు క్రీడా మైదానంలో ఆదివారం ఎస్‌పి క్రీడా పోటీల్లో భాగంగా క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడలు నిర్వహించడం వలన యువకుల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పడతాయన్నారు. గ్రామస్థాయి క్రీడాకారులు పోటీల్లో పాల్గొనడం వలన తమ ప్రతిభ బయట పడుతుందన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఎస్‌పి రాధిక చేతులమీదుగా బహుమతులు అందజేస్తామన్నారు. ఈ పోటీల్లో పలాస, బ్రాహ్మణతర్ల టీమ్‌లు తలపడ్డాయి. కార్యక్రమంలో ఎస్ఐ పారినాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్థానిక ఎస్ఐ సిహెచ్ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్‌పి కప్ 2024 టోర్నమెంట్‌ను డిఎస్‌పి నాగేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

వంతెన శంకుస్థాపన ఎన్నికల జిమ్మిక్కే

ఇచ్ఛాపురం: పట్టణంలో ఉన్న బహుదా నదిపై పాత వంతెన కూలిన స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం శంకుస్థాపన చేయడానికి వైసిపి నేతలు చేస్తున్న ప్రయత్నాలు కేవలం రానున్న ఎన్నికల జిమ్మిక్కేనని ప్రతిపక్షాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. ఈ వంతెన నిర్మాణానికి రహదారులు, భవనాల శాఖ అధికారులు దూరంగా ఉండడం పలు అనుమానాలు కలుగుతున్నాయి. ఎన్నికల కోడ్ మరికొద్ది రోజుల్లో వస్తున్న నేపథ్యంలో అసలు టెండర్లు ఖరారు కాకుండా వంతెన నిర్మాణానికి శంకుస్థాపన ఎలా చేశారని టిడిపి, జనసేన నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రజలను మభ్యపెట్టడం తప్పా ఈ వంతెన నిర్మాణం జరగదన్నారు. మున్సిపాలిటీకి ప్రోటోకాల్ ఇచ్చి శంకుస్థాపన ఖర్చు మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి కేటాయించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు అధికార పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. బాహుదా నది ప్రవహిస్తున్న భూభాగం అంతా లొద్దపుట్టి గ్రామ పంచాయతీ పరిధిలోకి వస్తుందని, ప్రస్తుతం నిర్మించే బ్రిడ్జి కూడా లొద్దపుట్టి పంచాయతీ, లొద్దపుట్టి రెవిన్యూ గ్రామం పరిధిలోనే ఉందని, మరి మున్సిపల్ కౌన్సిల్‌కు ప్రోటోకాల్ ఏమిటని, నిర్మాణం చేపట్టబోతున్న పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖకు బాహుదా నది భూభాగం పంచాయతీదో, మున్సిపాలిటీదో తెలియకుండా పని చేపడుతున్నారా అని నాయకులు ప్రశ్నిస్తున్నారు.. దీంతో బాహుదానదిపై రోడ్డు వంతెన శంకుస్థాపన వివాదాస్పదంగా మారింది. ఇదే విషయాన్ని రహదారులు, భవనాల శాఖ అధికారి మోహనరావు వద్ద ప్రస్తావించగా టెండర్లు ఖరారు కాలేదు అని స్పష్టం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలో హరిశ్చంద్రపురం రైల్వే ఫ్లైఓవర్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి పలాస వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న రైలు కిందపడి మృతి చెందాడు. మృతుడు వయసు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందని, నలుపు రంగు ప్యాంటు, కాకి రంగు చొక్కా ధరించి, తల గుండు చేసుకున్నట్లు కనిపిస్తుంది. అయితే ఈ విషయంపై రైల్వే పోలీసులకు వివరణ అడిగితే మాకు ఎలాంటి సమాచారం అందలేదని, పరిశీలించి సమాచారం అందజేస్తామని తెలిపారు.

జీడి పరిశ్రమలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి- పలాస

పలాస అన్నపూర్ణ థియేటర్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జీడి పరిశ్రమలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అగ్ని మాపక అధికారులు, జీడి పరిశ్రమ యజమానులు తెలిపిన కథనం మేరకు అన్నపూర్ణ థియేటర్ సమీపంలో ఉన్న ఎం. వెంకటరావు వరుణ్ జీడి పరిశ్రమ ఉంది. జీడి పరిశ్రమకు అనుకొని పరిశ్రమకు సంబంధించిన వృధాగా పడిఉన్న డబ్బాలు, చెత్త చెదారం ఉండడంతో ఒక్కసారిగా వృధాగా ఉన్న డబ్బాలకు మంటలు వ్యాపించాయి. జీడి పరిశ్రమ సమీపంలో మంటలు వ్యాపించాయనే విషయం జీడి యజమానులు తెలుసుకొని పరిశ్రమ వద్దకు పరుగులు తీశారు. జీడి పరిశ్రమ వద్ద అగ్ని ప్రమాదం జరిగిందని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే అగ్ని ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. అగ్ని ప్రమాదంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అగ్నిమాపకాధికారి సోమేశ్వరరావు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని ఎం.మరువాడలో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయానికి జిల్లా మత్స్యకార సహకార సంఘం డైరెక్టర్ సూరాడ జోగారావు, భార్య హేమలత రూ.51వేలు విరాళాన్ని ఆలయ ధర్మకర్త కొమర పోలయ్యకు అందించారు. ఆలయ నిర్మాణం కోసం రూ.46 వేలు, ఆలయ అభివృద్ధికి రూ.5 వేలు అందించారు. కార్యక్రమంలో సాయి గురువు వీర రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆహార భద్రతా చట్టాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి- సోంపేట

కంచిలి మండలం శాసనంలో గుడ్డిపద్ర వెంకట స్వామి అధ్యక్షతన భారత కమ్యూనిస్టు పార్టీ శాఖ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ మాట్లాడుతూ ఆహార భద్రత చట్టాన్ని పటిష్ట పరచాలని, ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలని, వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల భూమి హక్కులకు నష్టం చేసే ప్రభుత్వం తెచ్చిన భూమి యాజమాన్య హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని, చుక్కల భూములకు, బంజర భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. సాగులో ఉన్న కౌలు రైతులందరికి ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సాలీనా నారాయణ స్వామి, మండల నాయకులు లోకనాధం పాల్గొన్నారు.

బదిలీ ఎంపిడిఒకు సన్మానం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ఎన్నికల దృష్ట్యా బదిలీ అయిన ఎంపిడిఒ పి.చంద్రకుమారికి మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చేసిన సేవలను పలువురు కొనియాడారు. అలాగే ప్రమోషన్‌పై బదిలీ అయిన టైపిస్ట్ హేమలతకు ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, తిరుపతి పట్నాయక్, ఎపిఎం లలిత, శివాజీ, మోహనరావు, చింతల అప్పారావు, మురళి పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

76 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల కేంద్రంలో లోటస్ ఐ కేర్ ఆప్టికల్ షాప్ ఆవరణలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి శ్రీకాకుళం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 76 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 28 మందికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైద్య సహాయకులు పడాల దివాకర్, క్యాంపు కో-ఆర్డినేటర్ టి.రామారావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

లావేరు : స్థానిక శాఖాగ్రంథాలయములో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. మా తెలుగు తల్లికి మల్లెపూదండ అనే పద్యాన్ని, భావాన్ని ఆర్.జ్యోతి, జితేందర్లు తెలిపారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరుగుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రంథాలయం తరుపున బహుమతులను అందజేశారు. విద్యార్థులు పాల్గొన్నారు.

74వ రోజుకు దీక్ష

ప్రజాశక్తి- కవిటి

తమ బిడ్డల ఉన్నత చదువులు, యువతీ, యువకుల ఉద్యోగాన్వేషణ కోసం తమకు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని బెంతు ఒరియాలు స్పష్టం చేశారు. అంతవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 74వ రోజుకి చేరుకున్నాయి. ఆదివారం దీక్షలో ప్రగడ పుట్టుగ, సోంపేట గ్రామస్తులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తమజాతికి గుర్తింపు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిమ్మొ సాహు, ఈశ్వరరావు దలై, శ్రీరాం మూర్తి బిసాయి, రాజేష్ బిసాయి, సతీష్ బిసాయి, డి.మాధవరావు, హరీష్ సాహు, పిల్లి శంకర్, సుమన్ బిసాయి పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న బెంతు ఒరియాలు


సరుకులను పంపిణీ చేస్తున్న డాక్టర్ శ్రీధర్

పేదలకు సరుకుల పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పేదలను ఆదుకోవడం లక్ష్యంగా తన సేవలను విస్తృతం చేస్తున్న ప్రభాస్ సూర్య అలియాస్ గుజ్జల సూర్యనారాయణ ప్రస్తుత యువతకు ఆదర్శనీయమని వైద్యులు దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని శాంతినగర్ కాలనీలోని అంబేద్కర్ మందిరంలో డాడీ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యాన సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ మందిరంలో షెడ్ నిర్మాణానికి రూ.25 వేలు విరాళం అందించారు. 60 మంది నిరుపేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బిఆర్ ఫౌండేషన్ అధినేత బరాటం చక్రవర్తి, పీపుల్స్ సేవ్ వెల్ఫేర్ సొసైటీ పిడుగు నరేష్, బి.యోగానందం, విజయ్, ఎస్.బ్రహ్మాజీ, జోగినాయుడు, న్యూ బ్లడ్‌బ్యాంకు మణికంఠ, ఎం.సునీత, ముంజె భాగ్యం, సాయి పాల్గొన్నారు.


నివాళ్లర్పిస్తున్న సూపరింటిండెంట్ దేవేంద్ర రెడ్డి

ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురంలో వి.కె.పేటలో చిన్ని కిడ్స్ స్కూల్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 127వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక ఆస్పత్రి సూపరింటిండెంట్ పి.దేవేంద్ర రెడ్డి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి మాట్లాడుతూ సంఘ సంస్కర్త, మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు, రచయిత్రి, నిమ్నవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహిళ, ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మి తన భర్తతో కలిసి మొట్టమొదటి బాలికల పాఠశాలను ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో చిన్ని కిడ్స్ స్కూల్ డైరెక్టర్ పూడి సుష్మ (చిన్ని), ఆస్పత్రి వైద్యులు శిల్ప, కేంద్ర ప్రభుత్వ సైంటిఫిక్ ఆఫీసర్ రాజేష్, పూడి కిరణ్ కుమార్, అంబిక పాల్గొన్నారు


బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న లక్ష్మీదేవి

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలోని ఆదివారం పెద్దగనగళ్లవాని పేటలో ఇటీవల బర్రి కొర్లయ్య హార్ట్‌స్ట్రోక్‌తో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గుండు లక్ష్మీదేవి పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో మరణించిన సూరవరపు యర్రమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈమెతో పాటు సర్పంచ్ బర్రి రామారావు, చీగటి ఆమోజీరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి ఇప్పిలి శివ, జిల్లా మత్స్యకార సంఘ సభ్యులు మైలపల్లి నర్సింగరావు, టిడిపి నాయకులు పుక్కళ అప్పలస్వామి, బర్రి కృష్ణ, రామారావు ఉన్నారు.

వైసిపిని సాగనంపేందుకు సమిష్టి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపిల కలయిక చారిత్రాత్మకమని, కూటమిని పార్టీలో ప్రతి కార్యకర్తా స్వాగతిస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న క్లిష్టపరిస్థితులను ఎదుర్కొనేందుకు చంద్రబాబు నాయుడు పొత్తు నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఈ పొత్తుల వల్ల రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకునేందుకు వీలుందన్నారు. వైసిపి నిరంకుశ పాలనను తుదముట్టించేందుకు కలిసి పోటీ చేయనున్నట్లు తెలిపారు. అప్పలాంధ్రప్రదేశ్‌గా మార్చడమే కాకుండా చివరకు రాష్ట్ర సచివాలయాన్ని సైతం తాకట్టు పెట్టిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని


మాట్లాడుతున్న కూన రవికుమార్

అన్నారు. సమావేశంలో పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, బొణిగి భాస్కరరావు, సింతు సుధాకర్, రామరాజు, ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణ, విశ్రాంత ఆర్‌డిఒ పేడాడ జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నాలుగు దశాబ్దాల తరువాత 1980-81 ఎన్‌టిఆర్ ఎంహెచ్‌స్కూల్ చదువుకుని వివిధ ప్రాంతాల్లో పలు వృత్తుల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు నగరంలోని గ్రాండ్ హోటల్‌లో ఆదివారం కలుసుకున్నారు. ఒకొకరొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగ క్షేమాలను తెలుసుకున్నారు. 60 మంది విద్యార్థులు కలుసుకుని చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మండా శ్రీనివాస్, బాల మాన్‌సింగ్‌ల ఆధ్వర్యాన నిర్వహించారు. ఇందులో ప్రసాద్, ఉమ దంపతుల పెళ్లి రోజు వేడుకలను పురస్కరించుకుని దుశాలువ కప్పి సన్మానించారు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లిలోని గురుకుల కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తూ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన కె.వి.ఎల్.ఎన్.రావు, నాగావళి సెల్వెంట్‌లో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన వై.కూర్మారావు దంపతులనూ సత్కరించారు. మహిళలకు మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, బాలాగేమ్ ఇతర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఎస్.వి.కిషోర్, వి.వి.జోగారావు, డి.జి.సి.ఎస్.సీతారాం, సిహెచ్.రామ లింగేశ్వరరావు, ఎస్.వి.కె.విశ్వనాథం, కె.వి.రమణ, రామ్మోహనరావు పాల్గొన్నారు.

సామూహిక సూర్య నమస్కారాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని మారుతీ వాకర్స్‌క్లబ్, కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా షిరిడి సాయి యోగా సెంటర్ సహకారంతో ఆదివారం సామూహిక సూర్యనమస్కారాల కార్యక్రమాన్ని అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కలెక్టర్ ఎం.లావణ్య, ఎపిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడులు ప్రారంభించారు. మాఘమాసం అమావాస్యతో కూడిన ఆదివారం కావడంతో సామూహిక సూర్యనమస్కారాల కార్యక్రమాన్ని వంద మంది మహిళలతో నిర్వహించినట్లు మారుతి వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన మురళీధర్ తెలిపారు.


సామూహిక సూర్యనమస్కారాలు

రూ..4.50 లక్షల ఆదాయం

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి ఆదివారం రద్దీ సాధారణంగా ఉంది. దీనివల్ల ఒక్కరోజు రూ.4.50 లక్షల ఆదాయం సమకూరింది. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1,67,500, విరాళాల రూపంలో రూ.1,05,772, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,75,115 ఆదాయం సమకూరినట్లు ఇఒ రమేష్‌బాబు తెలిపారు.

నడకతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నడక, యోగాతోనే ఆరోగ్య సమాజం సాధ్యమవుతుందని వాకర్స్‌క్లబ్ గవర్నర్ పీజీ గుప్తా, లైన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి వ్యవస్థాపక అధ్యక్షులు హరికాప్రసాద్ అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని నూతనంగా స్టార్ వనిత వాకర్స్ క్లబ్ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుప్తా, హరికాప్రసాద్‌లు మాట్లాడుతూ నడకతో మెరుగైన ఆత్మగౌరవం, మంచి మానసిక స్థితి రావడంతో పాటు, ఒత్తిడి-ఆందోళన ఉదయం నడకతో తగ్గుతాయని చెప్పారు. నడక మెదడుకు రక్త సరఫరాను పెంచుతుందని, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత సాధ్యమవుతుందని అన్నారు. రోజుకు సగటున 30 నిమిషాలు నడవడం


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న వాకర్సు

వల్ల గుండె జబ్బుల ప్రమాదాన్ని 35 శాతం తగ్గించవచ్చన్నారు. అధిక రక్తపోటు, శరీర కొవ్వు, కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గించగల శక్తి నడకకి ఉందని చెప్పారు. కార్యక్రమంలో మారుతీ వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన మురళీధర్, గేదెల ఇందిరాప్రసాద్, రవిశంకర్, స్టార్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షులు సాసపు జోగినాయుడు పాల్గొన్నారు. అనంతరం స్టార్ వనిత కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షులుగా అంధవరపు జ్యోతిర్మయి, అధ్యక్షులుగా జి.లక్ష్మి, కార్యదర్శిగా వి.వాసంతి, ట్రెజరర్‌గా వి.స్రవంతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం డాక్టర్ గురివిల్లి ప్రమీల, బెహరా మనోవికాస కేంద్రం నిర్వాహకులు బెహరా శ్యామల, యోగా శిక్షకులు తంగి స్వాతి, సామాజిక సేవకులు హేమ, అరుణ, శ్యామలలను సన్మానించారు.


కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులు

వికలాంగుల హక్కుల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- సంత బొమ్మాళి

దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక సంత బొమ్మాళి కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఆవల వేణుగోపాల్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడుగా బడగల ఎర్రంనాయుడు, సెక్రటరీగా పల్లె లక్ష్మీనారాయణ, మండల కమిటీ మెంబర్‌గా కొప్పల అప్పారావు, మండల మహిళా అధ్యక్షురాలుగా కొర్ను లక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమ రిజర్వేషన్ ప్రకారం సంక్షేమ పథకాల్లో రూ.2700 వాటా 2016 చట్టం ప్రకారం అమలు చేయాలన్నారు. దివ్యాంగులకు ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించాలన్నారు. ఉపాధి పథకంలో జాబ్ కార్డు కల్పించి దివ్యాంగులకు పనికల్పించాలన్నారు.


పట్టణంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పట్టణంలో పోలీసు కవాతు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టెక్కలి పట్టణంలోని పలు వీధుల్లో ఆదివారం పోలీసులు కవాతు నిర్వహించారు. సుమారు 70 మంది సెంట్రల్ ఫోర్స్, డిఎస్‌పి బాలచంద్రారెడ్డి, సిఐ షైదయ్య ఆధ్వర్యంలో ఆదివారం కవాతు జరిగింది. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డిఎస్‌పి తెలిపారు.

కళింగ కోమట్ల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నియోజకవర్గంలో వైశ్యుల అభ్యున్నతికి కృషి చేశానని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని చిన్నబజారు రోడ్డులో ఉన్న కన్యాకాపరమేశ్వరి కళ్యాణ మండలంలో వైసిపి కళింగ కోమటి ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళింగ వైశ్యులను బిసిల్లో చేర్పించాలని కోరుతూ దాశ్యా సుబ్రహ్మణ్యం కమిషన్‌ను సిఫార్సు చేసింది తానేనని చెప్పారు. ఇప్పుడు చంద్రబాబు అనేక కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, దానిని నమ్మవద్దని చెప్పారు. కార్యక్రమంలో కళింగ కోమటి కార్పొరేషన్ ఛైర్మన్ అంధవరపు సూరిబాబు, కళింగ కోమటి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోణార్క్ శ్రీను, తంగుడు జోగారావు, ఊన్న నాగరాజు, తంగుడు నాగేశ్వరరావు, రమేష్ చక్రవర్తి, శేషగిరిరావు, గుడ్ల దామోదరరావు, ఐ.కె.రావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి ప్రసాదరావు

Advt. Feature

ప్రజాశక్తి

కామ్రేడ్...
చౌదరి పురుషోత్తం నాయుడు

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
ప్రత్యేక అనుబంధం

ఆదివారం 10-03-2024 | శ్రీకాకుళం జిల్లా | 8 పేజీలు







పోరుబాటలో ధీరుడు.. పురుషోత్తముడు

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన చౌదరి
- చరిత్ర సృష్టించిన నేతగా గుర్తింపు
- అందరినీ ఏకతాటిపై నడపడంలో దిట్ట
- సమర్థ నాయకత్వానికి సంకేతం
- ఉద్యోగుల హక్కుల సాధనలో ముందడుగు
- నేడు జిల్లాకు పురుషోత్తంనాయుడు రాక



ఓ కొత్త ఉదయం.. ఓ సరికొత్త బాధ్యత. ఈ వసంతాన.. ఈ నవ వసంతాన నందనవనాన.. వీలున్నంత వరకూ ఓ కొత్త దిశ వైపు ప్రయాణం.. ఓ మార్పునకు సంకేతం. వీలున్నా లేకున్నా మరో మార్పును ఆహ్వానిస్తూ ప్రయాణించడం వ్యక్తిత్వానికి సంకేతం. ఏ పని చేసినా నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనమై నిలిచే వ్యక్తి గుణమే సంఘానికి అలంకారం. మంచి పనులకు, మంచి నడవడికకు అదే ఆలంబన. చౌదరి పురుషోత్తం నాయుడు అందుకు తార్కాణం.

వారి ప్రయాణం మరో మంచి మార్పునకు శ్రీకారం. ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన చౌదరి పురుషోత్తం నాయుడు.. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆదివారం జిల్లాకు తొలిసారి రానున్న నేపథ్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు జిల్లాలోని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు సిద్ధమయ్యారు.

(కథనం.. 2లో)

మంచి స్నేహం
మంచి జ్ఞాపకం
మంచి ఉదయం
గొప్ప మార్పునకు సంకేతం

శుభోదయ రేఖలు కొన్ని
కొత్త విజ్ఞాన కాంతులు కొన్ని
అన్నీ అన్నీ కలిస్తే మరో
వసంతం

ఈ వసంతం ఓ ప్రత్యేకం
ఈ వసంతం మరో దివ్యమైన
మార్పునకు సంకేతం
ఎన్ ఎన్‌జిఒ సంఘ రాష్ట్ర ప్రధాన
కార్యదర్శిగా ఎన్నికైన చౌదరి
పురుషోత్తం నాయుడుకు
అభివందనం శుభాభివందనం..

ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వాన్ని ఒప్పించగలిగాం

ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తంనాయుడు

"రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా తొలి నుంచీ ఉద్యోగుల హక్కుల కోసం ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నికార్సయిన పోరాటం సాగిస్తోంది. ఉద్యోగుల సమస్యలను తీర్చేది, పరిష్కరించేది ప్రభుత్వమే. ప్రభుత్వ పెద్దలను ఒప్పించి పని చేయించుకోవాలి. ఆ దిశగానే ప్రయత్నించాం."

\- చౌదరి పురుషోత్తంనాయుడు

3లో

పోరుబాటలో అజేయుడు.. పురుషోత్తముడు

ఉద్యోగి సంక్షేమమే ప్రథమ ధ్యేయం

ఉద్యోగి సంక్షేమమే ప్రథమ ధ్యేయంగా చౌదరి పురుషోత్తం నాయుడు పనిచేస్తూ వస్తున్నారు. నిర్బంధాలు దాటుకుని, ఉద్యమాలను విజయవంతం చేయడంలో సఫకృతం అవుతున్నారు. ఎన్ఎన్‌జిఒ సంఘంతో అనుబంధం ఆమదాలవలసలో ఆరంభం అయింది. ఆ రోజు ఆయన తాలుకా అధ్యక్షులుగా ఎన్నికై, సంఘంలో తన ప్రస్థానం ప్రారంభించారు. తరువాత అంచలంచెలుగా ఎదిగారు. ఎనిమిది సార్లు రాష్ట్ర కార్యవర్గంలో కీలకంగా పనిచేశారు. నాలుగు సార్లు రాష్ట్ర

ఎన్నో ఉద్యమాలకు కేరాఫ్‌గా నిలిచారు.. చౌదరి పురుషోత్తం నాయుడు. ఎన్నో ఉద్యోగ సమస్యలను ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి పరిష్కరించారు. విభజిత ఆంధ్రాలోనో, సమైక్య రాష్ట్రంలోనూ ఎంతో నిబద్ధతకు తార్కాణమై నిలిచిన ఏకైక ఉద్యోగ సంఘం ఎపి ఎన్‌జిఒ అసోసియేషనే. ఇప్పడీ సంఘానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా చౌదరి పురుషోత్తం నాయుడు ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో గెలుపు పతాకం ఎగుర వేశారు. ఈ సందర్భాన వారి ప్రస్థానం.. వారి జీవన శైలి.. వారి నేపథ్యం అన్నీ ఈ ప్రత్యేక కథనంలో...

-ప్రజాశక్తి, శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యక్షులుగా, నాలుగు సార్లు సహాధ్యక్షులుగా ఉన్నారు. ఎపి ఎన్‌జిఒలో మహిళా శాఖ ఏర్పాటుకు కూడా ఆయన చొరవ చూపి ప్రశంసలు అందుకున్నారు. ఇవాళ ఆ కార్యవర్గం పనితీరు కూడా బాగుంది. రాష్ట్ర మహాసభల తరువాత మహిళల ప్రాధాన్యం మరింత పెరిగింది. తాలుకా, జిల్లా, రాష్ట్ర కార్యవర్గాలలో మహిళలకు చోటు ఇచ్చేందుకు చౌదరి పురుషోత్తం నాయుడు చొరవ సత్ఫలితం ఇచ్చింది. మహిళలకు చైల్డ్ కేర్ లీవ్ విషయమై కూడా నాటి ప్రభుత్వం దగ్గర అనుకున్నది సాధించారు. ఇప్పటి ప్రభుత్వం దానిని ఫ్యామిలీ కేర్ లీవ్‌గా మార్చింది. జీతం ఇస్తూ.. ఆరు నెలలు కాలం సెలవు తీసుకునే విధంగా వీలు కల్పించింది. త్వరలో ఇందుకు సంబంధించిన జిఒ రానుంది.

మరిన్ని మార్పులకు శ్రీకారం

ఆ రోజు చైల్డ్ కేర్ లీవ్ రెండు నెలలు ఉండేది. 19వ రాష్ట్ర మహాసభలలో ఇందుకు సంబంధించి ప్రతిపాదన పెట్టి నాటి సిఎం చంద్రబాబుతో ఓకే చేయించారు. నాటి సభలో ఇరవై శాతం హెచ్‌ఆర్ఎ తీసుకుని వచ్చి అందరి మన్ననలూ అందుకున్నారు. కారుణ్య నియామకాలకు సంబంధించి ఎపిఎన్‌జిఒ సంఘం తరపున ఆయన చొరవ చూపి సత్ఫలితాలు అందుకుని, మానవతకు నిదర్శనమై నిలుస్తున్నారు. జిల్లాలో ఎప్పటికప్పుడు సంబంధిత పోస్టులు ప్రభుత్వం భర్తీ చేసే విధంగా సంఘం కృషి చేస్తోంది. గతంలో సిఎం సహాయనిధి మంజూరు చేయించి ఎన్నో బాధిత కుటుంబాలను ఆదుకున్నారు. హుదూద్, తిత్లీ తుపాన్ల సమయాల్లో ఉద్యోగులంతా శక్తివంచన లేకుండా కృషి చేసి ఆ రోజు మానవతను చాటుకున్నారు. ఎపిఎన్‌జిఒ సంఘం కూడా వీరికి ఎప్పటికప్పుడు అండగా నిలిచి, నాటి విజయాల్లో భాగమైంది. అంతేకాదు ఇవాళ ఉద్యోగుల విధి నిర్వహణలో భాగంగా ఏ ఇబ్బంది వచ్చినా ఎపిఎన్‌జిఒ సంఘం అండగా ఉంటోంది.

మరికొన్ని బాధ్యతలు

ఎపి వాణిజ్య పన్నుల ఉద్యోగుల సంఘం తరపున కూడా పురుషోత్తంనాయుడు కీలక బాధ్యతలు నిర్వర్తించారు.



ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన చౌదరి పురుషోత్తంనాయుడుతో రాష్ట్ర నాయకులు

1999 నుంచి వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం విజయనగరం డివిజన్ అధ్యక్షులుగా ఏడు సార్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వాణిజ్య పన్నుల శాఖలో కొత్త పోస్టులు క్రియేట్ చేయాలని, ఉద్యోగులపై పని భారం తగ్గించాలని కోరుతూ అనేక సార్లు ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు. అవసరం అయితే ఉద్యమించేందుకు కూడా వెనుకంజ వేయబోమని తేల్చి చెప్పారు. సత్ఫలితాలు సాధించారు. అంతేకాదు జిఎస్‌టి ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికై కొనసాగుతూ ఉన్నారు.

సంక్షోభాలను నిలువరిస్తూ.. నివారిస్తూ..

జిఎస్‌టి వచ్చాక క్షేత్ర స్థాయిలో నెలకొన్న సంక్షోభాలను నిలువరించారు. ఇవన్నీ ఎపి ఎన్‌జిఒ సంఘ సహకారంతోనే పురుషోత్తంనాయుడు సాధించారు. ఆ సంఘం సహకారంతోనూ, తోడ్పాటుతోనూ వాణిజ్య పన్నుల శాఖకు సంబంధించిన ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలు పరిష్కరించారు. అనేక సందర్భాల్లో క్షేత్ర స్థాయిలో ఉద్యోగులకు అండగా నిలిచి వారి ఒత్తిడిని దూరం చేశారు. జెఎసి తరపున కూడా ఎప్పటికప్పుడు కార్యాచరణను ముమ్మరం చేస్తున్నారు. 2022 ఫిబ్రవరి మూడున విజయవాడ బిఆర్‌టిఎస్ రోడ్డులో నాలుగు జెఎసిల ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా భారీ ఉద్యమం నడిపించారు. ఆ రోజు నిర్వహించిన చలో విజయవాడ ఉద్యమం ఉద్యోగుల చరిత్రలో నిలిచిపోతుంది. ఆ రోజు పోలీసు ఆంక్షలు దాటుకుని ఉద్యమాన్ని విజయవంతం చేయడంలో చౌదరి పురుషోత్తం నాయుడు కీలకంగా వ్యవహరించారు.

సవాళ్లున్నా సమరభేరి వీడం

'ఇవాళ ఏ నిరసన తెలియజేసినా పోలీసు ఒత్తిళ్లు ఉండడం అన్నది సర్వసాధారణమైంది. ఓ వైపు మంత్రివర్గ ఉప సంఘంతో చర్చలు జరుగుతూనే ఉన్నాయి. మరోవైపు ఉద్యోగుల అరెస్టుల పేరుతో నిర్బంధ కాండలు కొనసాగిస్తూనే ఉన్నారు. ముఖ్యంగా ఉద్యోగులకు బైండోవర్ నోటీసులు, హౌస్ అరెస్టులు, వీటితో పాటే ఏదో ఒక విధంగా ఉద్యమాలను సాగనివ్వకుండా నిర్బంధకాండను కొనసాగిస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలను తెలిపే హక్కు ఉన్నా కూడా ప్రభుత్వం మాట వినేలా లేదు. మొండి వైఖరితో వ్యవహరిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎపిఎన్‌జిఒ సంఘానికి కానీ, ఇతర ఉద్యోగ సంఘాలకు పెద్ద సవాలు. వీటిని అధిగమించి మనకు రావాల్సిన రాయితీలు కానీ, ఆర్థిక ప్రయోజనాలు కానీ రాబట్టుకోవడం కానీ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం కానీ ఇవాళ ఎపిఎన్‌జిఒ సంఘం ముందున్న ప్రధాన సవాలు. ఇంతకుముందు ఏకైక జెఎసిగా ఉన్న ఉద్యోగుల సమూహం ఇప్పుడు నాలుగు జెఎసిలుగా విడిపోయింది. అందుకు విభజించు పాలించు సూత్రాన్ని ప్రభుత్వ పెద్దలు పాటిస్తుండడమే ప్రధాన కారణం. ఇది వరకు కన్నా ఇప్పుడు ముఖ్యమంత్రితో కానీ, మంత్రులతో కానీ ఏదైనా ఒక విషయం ఒప్పించడం కానీ, అంగీకరింపజేయడం కానీ తలకు మించిన భారం అవుతోంది. క్లిష్టతరంగా మారింది."

- చౌదరి పురుషోత్తంనాయుడు

శ్రామిక కార్మిక ఆశాజ్యోతి

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జెఎసి తరపున పురుషోత్తంనాయుడు కీలకంగా పనిచేస్తున్నారు. కంట్రిబ్యూటరీ పింఛను విధానం (సిపిఎస్)ను వ్యతిరేకిస్తూ.. 2004 నుంచి ఎపిఎన్‌జిఒ సంఘం తరపున పోరాడుతున్నారు. అయినప్పటికీ పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం చట్టం చేసింది. దీనిని వ్యతిరేకిస్తూ సిపిఎస్ రద్దు కోసం జాతీయ స్థాయిలో పోరాటం చేస్తున్నారు. అయినా సరే! దీనికి ప్రత్యామ్నాయంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జిపిఎస్ (గ్యారెంటీ పెన్షన్ స్కీమ్)ను తీసుకు వచ్చింది. దీనిని కూడా వ్యతిరేకిస్తూ.. పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించడమే ఏకైక అత్యున్నత పరిష్కారమని, ప్రభుత్వాలకూ, సంబంధిత పాలకులకూ నిర్దేశిస్తూ ఉద్యమిస్తున్నారు. విభజిత ఆంధ్రాకు ప్రత్యేక హోదా కావాలని, సంబంధిత డిమాండ్ సాధనకు వివిధ స్థానిక నాయకత్వాలతో కలిసి కృషి చేశారు. విశాఖ కేంద్రంగా ప్రత్యేక రైల్వే జోన్ ఏర్పాటు కోసం కూడా ఉద్యమించారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో సంబంధిత ఉద్యమాలకు మద్దతుగా నిలిచి, బాసటగా అందించారు. సంబంధిత కార్యాచరణను అనుసరించి క్షేత్ర స్థాయిలో ఉద్యమించి స్థానిక నాయకత్వాలకు అండగా నిలిచి ముందుకు సాగారు.

మంచి స్నేహితులే ఎల్లవేళలా తోడు

ఆచరణ వాది చౌదరి పురుషోత్తం నాయుడు. కర్తవ్య దీక్షాధారి కూడా. ఉన్నంతలో అందరికీ మేలు చేయడం ఆయనకు మాత్రమే తెలిసిన పని. 'తల్లీ, తండ్రీ ఇవే నేర్పారు, నేను పాటిస్తున్నాను. తాత, ముత్తాతల కాలం నుంచి వచ్చిన మంచి గుణాలే ఇవి. మా తాతయ్య చౌదరి సత్యనారాయణ, మా నాన్న చౌదరి తేజేశ్వరరావు నుంచి నేర్చుకున్న మంచి లక్షణాలే ఇవి' అని అంటారాయన. ఎపిఎన్‌జిఒ సంఘం చొరవతోనే కొత్త పిఆర్‌సి ఏర్పాటయింది. అందుకు పురుషోత్తంనాయుడు కృషి అద్వితీయం. డిఎల క్లియిరెన్స్ లోనూ, పెండింగ్ ఫైళ్ల క్లియిరెన్స్‌లోనూ ఆ రోజూ, ఈ రోజూ చివరివరకూ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి, వాటిని విజయవంతం చేసిన నాయకుడు కూడా ఆయనే. ఆయనకు తోడుగా ఎల్లవేళలా నిలిచే మంచి స్నేహితులు హనుమంతు సాయిరాం, ఆర్‌విఎన్ శర్మ, చల్లా శ్రీనివాస్, ఆర్.వేణు గోపాల్ ఇంకా ఇంకొందరు. అందరినీ కలుపుకుని పోయే తత్వానికి తార్కాణం ఆయన జీవితం. అందుకు నిదర్శనం ఆయన నడవడిక.

ఒక వైఫల్యం.. ఒక వేదన

సమైక్యాంధ్ర ఉద్యమం విఫలం కావడం బాధాకరం. ఉమ్మడి ఆస్తుల లెక్క ఎలా ఉన్నప్పటికీ ఇప్పటికీ ఉద్యోగుల విభజన ప్రక్రియ పూర్తి కాలేదు. విభజన వల్ల ఉద్యోగులకే భారీ ఎత్తున నష్టం జరిగింది. నష్ట నివారణ చర్యలు ఇప్పటి వరకూ పూర్తి స్థాయిలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రభుత్వాలూ చేపట్టలేదు. విభజన హామీలపై ఇకపై కూడా సామాజిక బాధ్యతలో భాగంగా మాట్లాడుతున్నాం. ఉద్యోగులకు జరిగిన నష్టానికి సంబంధించి సామాజిక బాధ్యతగా కృషి చేస్తాం. ఈ ప్రాంతం అభివృద్ధి కోరుతూ విశాఖ రాజధాని వస్తే ఆహ్వానిస్తాం. ఉంటే మంచిది. సిఎం జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానులని చెప్పారు. విశాఖ రాజధాని అవ్వడం వల్ల అభివృద్ధికి ఆస్కారం ఉంది. ఇక నాటి నుంచి నేటి వరకూ నేను వివిధ సంఘాలతో పనిచేశా. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో పనిచేసే అడ్వకేట్ జెఎసితో మంచి అనుబంధం ఉంది. ఎపిఎన్‌జిఒ సంఘానికి న్యాయపరమైన సలహాలు కావాలంటే 'మేం ఉన్నాం' అని ముందుకు వచ్చి, ముందు వరుసలో నిలిచే వ్యక్తులు వాళ్లు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులకు నా ప్రత్యేక కృతజ్ఞతలు.

- చౌదరి పురుషోత్తం నాయుడు

మార్పునకు సంకేతం

ఇప్పుడంటే ఎపిఎన్‌జిఒ హోంలు ఉన్నాయి. కానీ ఒకప్పుడు లేవు. మన శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఉన్న ఎపిఎన్‌జిఒ హోం నిర్మాణానికి సంబంధిత ప్రణాళికలకూ, కలల సాకారానికి చౌదరి పురుషోత్తం నాయుడు కృషి చేశారు. మరోవైపు ప్రభుత్వంపై ఎపిఎన్‌జిఒ సంఘం మంచి అనుబంధాలు కలిగి ఉంది. నిన్నమొన్నటి ఎపిఎన్‌జిఒ సభలు కూడా ఇదే నిరూపించాయి. అంటే ప్రభుత్వాలు మారినా తమదైన నిబద్ధతతో పని చేస్తూ, తమ పని తీరుతోనే నెగ్గుకు వచ్చే సంస్థ, సంఘం ఎపిఎన్‌జిఒలది. అందుకు కారణం చౌదరి పురుషోత్తం నాయుడు లాంటి ముఖ్యమైన నాయకులే. కష్టం, కన్నీళ్లు అంటూ వచ్చే వారికి ఇవాళ ఆయనొక కేరాఫ్. వారి సమస్యలు తీర్చిపంపుతారు. రెండు దశాబ్దాలకు పైగా ఉద్యోగ సంఘ సారథిగా ఉంటూ, అన్ని వర్గాల మెప్పు పొందడం చిన్న విషయం కాదు. పెద్ద విజయం. పెను మార్పు కూడా !. అలాంటి నేపథ్యంలో ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా శ్రీకాకుళం జిల్లానే కాదు, ఉత్తరాంధ్ర నుంచి తొలిసారి చౌదరి పురుషోత్తంనాయుడు ఎన్నికవడం ద్వారా చరిత్ర సృష్టించారు. ఎపి ఎన్‌జిఒ సంఘానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన వేళ చౌదరి పురుషోత్తం నాయుడుకు జిల్లా వ్యాప్తంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వాన్ని ఒప్పించగలిగాం



హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం : ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు సంబంధించి కొన్ని ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వాన్ని ఒప్పించగలగడమే ఒక గొప్ప విజయమని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి పురుషోత్తం నాయుడు అన్నారు. అసోసియేషన్‌కు ప్రధాన కార్యదర్శిగా ఇటీవల కొత్తగా బాధ్యతలు చేపట్టిన క్రమంలో ఆయన 'ప్రజాశక్తి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి అనేక డిమాండ్లు ఉన్నా తొలుత ప్రధాన డిమాండ్ల పరిష్కారంపై దృష్టి సారించామని చెప్పారు. అందులో భాగంగానే ఈ నెల ఏడో తేదీన అమరావతిలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమైన అంశాలను ప్రస్తావించామన్నారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఐఆర్ ఇవ్వాలని ప్రధాన డిమాండ్‌ను ప్రభుత్వం ముందు ఉంచామని చెప్పారు. సెప్టెంబరు ఒకటి, 2004 తర్వాత నుంచి సిపిఎస్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అంతకుముందు నోటిఫికేషన్‌లో ఎంపికై ఆ తర్వాత విధుల్లో చేరిన వారిని ఒపిఎస్ ఉద్యోగులగానే పరిగణించాలని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక సర్క్యులర్ జారీ చేసిందని అన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలుకు సిద్ధపడం లేదని ఈ అంశాన్నే చర్చల సందర్భంగా ప్రస్తావించామని తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రూ.20 వేల కోట్లు ఉందని, ప్రస్తుతం రూ.11 వేల కోట్లను వచ్చే మూడు నెలల్లో సర్దుబాటు చేస్తామని ప్రభుత్వం స్పష్టమైన హామీనిచ్చిందన్నారు. సరెండర్ లీవ్‌లకు సంబంధించిన సొమ్ములు వెంటనే ఇవ్వాలని ప్రభుత్వం ముందు డిమాండ్‌గా ఉంచామన్నారు.

చర్చల నేపథ్యంలోనే ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ... ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. ఉద్యోగుల హక్కుల సాధన క్రమంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఉద్యోగులకు ఐఆర్, 12వ పిఆర్‌సి, సిపిఎస్ రద్దు, ఒపిఎస్ పునరుద్ధరణ తదితర అనేక అంశాలపై ఇటీవల తాలుకా స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అనేక రూపాల్లో ఆందోళనలు నిర్వహించామని గుర్తుచేశారు. వాటి ఫలితమే ప్రస్తుతం ప్రభుత్వం చర్చలకు పిలిచిందని చెప్పారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా తొలి నుంచి తమ సంఘం ఉద్యోగుల హక్కుల కోసం నికార్సయిన పోరాటం సాగిస్తోందని చెప్పారు. ఉద్యోగుల సమస్యలను తీర్చేది, పరిష్కరించేది ప్రభుత్వమే గనుక ప్రభుత్వ పెద్దలను ఒప్పించి పని చేయించుకోవాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. దీనిని ప్రభుత్వంతో రాజీపడుతున్నట్లుగా చూడకూడదని అన్నారు. అసోసియేషన్ పరంగా గతంలో వివిధ రకాల పోరాటాలు చేసి ప్రభుత్వం ద్వారా అనేక రాయితీలు, హక్కులు సాధించుకున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రధాన డిమాండ్లను మూడు నెలల కాలంలో నెరవేరుస్తామని ప్రభుత్వం హామీనిచ్చిన నేపథ్యంలో అంతా దాని కోసం వేచి చూడాల్సి ఉందన్నారు. ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకోలేని పక్షంలో మరో పోరాటానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు.

చౌదరి.. రోల్ మోడల్

- సంఘాన్ని ఏకతాటిపై తీసుకెళ్తున్న పురుషోత్తంనాయుడు
- ఎదిగినా ఒదిగి ఉండాలనేది ఆయన నేర్పిన పాఠమే
- ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సాయిరాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

'చౌదరి పురుషోత్తంనాయుడు మాకు రోల్ మోడల్. ఆయనో లెజెండ్. నేను ఉద్యోగంలో చేరకముందు కొన్నేళ్ల క్రితం ఆమదాలవలస నుంచి సంఘ నాయకత్వాన్ని పుణికి పుచ్చుకున్న చౌదరి పురుషోత్తం నాయుడు నూతనంగా ఏర్పడిన ఎపిఎన్‌జిఒ సంఘానికి రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా బాధ్యతలు మోస్తుండడం గర్వంగా ఉంది. సంఘాన్ని ఏకతాటిపై తీసుకెళ్లడంలో ఆయనకు ఆయనే సాటి' అన్నారు ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం. అటు ఉద్యోగులకు, ఇటు సంఘ నాయకులకు మార్గదర్శకాలు ఇవ్వడంలో ఆయన దిట్టని పేర్కొన్నారు. ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా చౌదరి పురుషోత్తంనాయుడు ఎన్నికైన నేపథ్యంలో సాయిరాం 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ నాయకులుగా చలామణి అయినా, ముందు ఉద్యోగ కర్తవ్యం నెరవేర్చి ప్రజలకు, అటు తోటి ఉద్యోగులకు అండగా నిలవాలని పురుషోత్తంనాయుడు ఎప్పుడూ సూచిస్తుంటారని, అది ఆయనలో ఉండే గొప్పతనమని తెలిపారు. సంఘం పట్టణ అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి జిల్లా అధ్యక్షులుగా సేవలందిస్తున్న తనతో పురుషోత్తం నాయుడు సోదర భావంతోనే ఉంటామన్నారు. ఆయన రాష్ట్ర నేతగా ఏ రోజూ హోదాతో చెలామణి కాలేదని, కేవలం సొంత జిల్లా అని కాకుండా మిగిలిన జిల్లాల్లోనూ అదే పంథాన పయనించడం గొప్ప విషయమని చెప్పారు.



చౌదరి వారి ఇంటి పేరు అయినా.. ఎన్‌జిఒ నేత పురుషోత్తం నాయుడుగానే అందరికి సుపరిచితులన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని సంఘ కార్యకలాపాలను తానే కాకుండా మిగిలిన బృందమంతా నిర్వహిస్తుంటామని తెలిపారు. దశాబ్దాల తరబడి సంఘ బాధ్యతలు మోయడమంటే ఆషామాషీ కాదన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో రోల్ మోడల్ అన్నారు. అధికారులు సైతం చౌదరి పురుషోత్తం నాయుడు మృధుస్వభావిగా గుర్తిస్తారన్నారు. కుటుంబం కంటే ఆయనతో చేసే ప్రయాణం అధికమన్నారు. కేవలం ఇదేదో తాను జిల్లా అధ్యక్షులుగా చెబుతున్న మాటలు కాదన్నారు. ఉద్యోగిగా, జిల్లా వాసిగా పురుషోత్తం నాయుడు సేవలను కీర్తించాలన్నారు. ఎపిఎన్‌జిఒ సంఘం తరుపున ఆదివారం జిల్లాకు వస్తున్న ఆయనను స్వాగతం పలుకుతున్నామన్నారు. రానున్న రోజుల్లో ఆయన అడుగుజాడల్లో పయనించి, సంఘం పరంగా జిల్లాకు గౌరవం దక్కేలా కృషి చేస్తామని హనుమంతు సాయిరాం వివరించారు.

ఎన్‌జిఒ చరిత్రలో

ప్రత్యేకత అధ్యాయం

- ఉద్యోగులకు అండగా నిలుస్తున్న చౌదరి
- జిల్లాలో మన్ననలు పొందుతున్న పురుషోత్తం నాయుడు, హనుమంతు సాయిరాం జోడి

ఎన్‌జిఒ పేరు ప్రస్తావనకు వస్తే చౌదరి పురుషోత్తంనాయుడు, హనుమంతు సాయిరాం పేర్లే టక్కున చెబుతారు. అటు రాష్ట్రంలో కూడా పురుషోత్తం నాయుడు పేరు ప్రస్తావన లేకుండా ఎన్‌జిఒ లేదనేది అతిశయోక్తికాదు. అందులో జిల్లాకు వచ్చే సరికి జిల్లా అధ్యక్షులుగా హనుమంతు సాయిరాం బాధ్యతలు నిర్వహిస్తూ తనవంతుగా పురుషోత్తంనాయుడుకు అండగా నిలవడంతో వారిద్దరి కాంబినేషన్‌తో ముందుకు దూసుకువెళ్తున్నారు. ఏ ఉద్యోగికి వేధింపులు, కష్టాలు ఎదురయ్యాయంటే పక్షుల్లా అక్కడ వాలిపోవడం, భరోసానివ్వడం వారి నైజం. సంఘపరంగా, హోదాలో ఇద్దరికి వ్యత్యాసం ఉన్నా ఆ భావన పురుషోత్తం నాయుడు, సాయిరాంలో ఎక్కడా కనిపించదు. ఎవరికి ఎవరూ తీసిపోని విధంగా ప్రయణిస్తున్న వారిద్దరు కూడా పదవుల్లోనూ అంచలంచెలుగా ఎదుగుతున్నారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



పురుషోత్తంనాయుడును సన్మానిస్తున్న ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా నాయకులు

మంచి మనిషిగా, ఉద్యమనేతగా ఉద్యోగుల మన్ననలు పొందిన ఏకైక వ్యక్తి పురుషోత్తం నాయుడు అనడంలో అతిశయోక్తి లేదు. సుదీర్ఘకాలంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆయన పాటు పడుతున్నారు. వాణిజ్య పన్నుల శాఖ అసోసియేషన్ తరపునే కాకుండా ఎపిఎన్‌జిఒల పక్షాన కూడా ఆయన పోరాటాలు సాగించారు. ఈ క్రమంలో ఉద్యోగుల అభిమానాన్ని ఆయన చూరగొన్నారు. దీంతో జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ఎదిగారు. నేడు ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై చరిత్ర సృష్టించారు. ఉద్యమాల ఖిల్లాగా పేరొందిన శ్రీకాకుళం జిల్లా నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికవడంతో జిల్లా పేరు ప్రతిష్టలను ఆయన మరోసారి ఇనుమడింపజేశారని చెప్పాలి.

శ్రీకాకుళం జిల్లాలో ఎన్‌జిఒ అసోసియేషన్ అంటేనే టక్కున చౌదరి పురుషోత్తం నాయుడు, సాయిరాం పేరు గుర్తుకువస్తుంది. జిల్లాలో ఏ ఎన్నికల్లో కూడా వారిద్దరి స్నేహం సంఘం ఐక్యతగా వ్యవహరించేందుకు దోహదపడుతోంది. రాష్ట్ర సంఘ నేతగా భావించి గిరి గీసుకొని ఉండకుండా సమస్యలు ఉత్పన్నమైనప్పుడు సాయిరాంతో కలిసి చర్చించి సామరస్యంగా పరిష్కరించడానికి కృషి చేయడంతోనే జిల్లాలో ఉద్యోగులంతా వారి నాయకత్వానికి జేజేలు పలుకుతున్నారు. సాయిరాం సైతం ఉద్యోగులకు అండగా నిలవడంలో జిల్లా కార్యవర్గంతో సమాలోచనలు చేసుకుని అటు పురుషోత్తం నాయుడుతో సమన్వయ పరుచుకుని ఎన్‌జిఒ అసోసియేషన్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు. ఎక్కడ పొరపొచ్చులు లేకుండా వెళ్లడం ఎపిఎన్‌జిఒ సంఘానికే చెల్లింది.

ఎన్‌జిఒలకు చౌదరి పెద్దదిక్కు

ఎపిఎన్‌జిఒ సంఘంలో కీలక బాధ్యతలు తీసుకున్న చౌదరి పురుషోత్తంనాయుడు.. జిల్లాకు అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తున్నారు. జిల్లాలో అసోసియేషన్‌ను ఏకతాటిపై నడిపించడంలో ప్రధాన భూమిక పోషిస్తున్నారు. అందరి అభిప్రాయాలను గౌరవిస్తూ ఉద్యోగులంతా ఐక్యంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో జిల్లాలో అసోసియేషన్ వారి నేతృత్వంలో పటిష్ఠంగా ఉంది. జిల్లా అసోసియేషన్ నుంచే చౌదరి రాష్ట్ర స్థాయికి ఎదిగారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, విభజన తర్వాత నవ్యాంధ్రలో కూడా చక్రం తిప్పుతున్నారు. నాలుగు సార్లు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, నాలుగు పర్యాయాలు రాష్ట్ర సహాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. రెండు దశాబ్దాలకు పైగా రాష్ట్ర కార్యవర్గంలో స్థానం దక్కించుకున్న ఏకైక నాయకునిగా రికార్డు సృష్టించారు. ఎపిఎన్‌జిఒ అసోసియేషన్‌లో గెజిటెడ్ ఆఫీసర్లకి కూడా ఇటీవల స్థానం కల్పించి అసోసియేషన్ కాస్తా ఎపిఎన్‌జిఒస్ అసోసియేషన్‌గా ఆవిర్భవించింది. ఈ రాష్ట్ర అసోసియేషన్‌కి చౌదరి పురుషోత్తం నాయుడు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై చరిత్రలో తన కంటూ ప్రత్యేకతను చాటుకున్నారు. ఉద్యోగులకు తలలో నాలుకలా ఉండే వ్యక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.


చౌదరి పురుషోత్తంనాయుడు చిత్రమాలిక


సిఎం జగన్‌తో చౌదరి పురుషోత్తంనాయుడు


ప్రభుత్వ సలహాదారు సజ్జలతో ఎన్‌జిఒ నాయకులు


ర్యాలీలో పాల్గొన్న పురుషోత్తంనాయుడు, సాయిరాం




సిఎస్ జవహర్‌రెడ్డితో సమావేశమైన ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు


మంత్రి ధర్మానను సత్కరిస్తున్న ఎన్‌జిఒలు


జన్మదిన వేడుకల్లో పురుషోత్తంనాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు


శ్రీకాకుళం పూర్వ కలెక్టర్ నివాస్‌ను అభినందిస్తున్న ఎన్‌జిఒ నాయకులు



ఉద్యోగులతో మాట్లాడుతున్న పురుషోత్తంనాయుడు


పూర్వ కలెక్టర్ విష్ణు నుంచి జ్ఞాపిక స్వీకరిస్తున్న పురుషోత్తంనాయుడు


జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న పురుషోత్తంనాయుడు


రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఎన్నికైన పురుషోత్తంనాయుడు



అభివాదం చేస్తున్న ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు


పురుషోత్తంనాయుడును సత్కరిస్తున్న పింఛనుదారుల సంఘం నాయకులు


సంఘ నాయకులతో కలిసి చర్చల్లో పాల్గొన్న పురుషోత్తంనాయుడు


సిఎం జగన్‌తో పురుషోత్తంనాయుడు


మాజీ సిఎం చంద్రబాబునాయుడుతో పురుషోత్తంనాయుడు



చౌదరి పురుషోత్తంనాయుడు చిత్రమాలిక


మాజీ సిఎం రాజశేఖర్‌రెడ్డితో పురుషోత్తంనాయుడు


టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడుతో పురుషోత్తంనాయుడు


ప్రదర్శనలో పాల్గొన్న జెఎసి నాయకులు


ఎన్నికైన రాష్ట్ర నూతన కమిటీ



సమావేశంలో మాట్లాడుతున్న పురుషోత్తంనాయుడు


అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శివారెడ్డితో ప్రధానకార్యదర్శి పురుషోత్తంనాయుడు

ఉద్యోగుల ఉద్యమ శిఖరం

- ప్రభుత్వం ఏదైనా ఒప్పించి, మెప్పించగల చాణక్యుడు పురుషోత్తంనాయుడు
- ఎపిఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా చౌదరి
- జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు
- శుభాకాంక్షల వెలువ


జెఎసి ప్రదర్శనలో పాల్గొన్న ఎపిఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి, చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్షులు సాయిరాం, తదితరులు

చౌదరి పురుషోత్తం నాయుడు.. ఉద్యోగుల ఉద్యమ శిఖరం. సిక్కోలుకే మణిమకుటం. ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాటమే శరణ్యంగా ఉద్యమించిన నేత. అందుకు తన ఉద్యోగోన్నతిని సైతం ఫణంగా పెట్టిన ధీరుడు. ప్రభుత్వం ఏదైనా.. పాలకుడు ఎంత కర్కోటకుడు అయినా.. ఒప్పించి, మెప్పించగల అపర చాణక్యుడు. ఉద్యోగుల హక్కుల సాధనకు.. ఉద్యమ కెరటమై లేచిన ఉత్తుంగ తరంగం.. ఈ ప్రహసనంలో.. ఎన్నో ఆటుపోట్లు, విమర్శలు, ఎదురుదెబ్బలు, వ్యక్తిగత ప్రతిష్ఠ దెబ్బతీసే కుట్రలు ఎదురైనా.. చిరునవ్వుతోనే జయించిన మార్గదర్శకుడు. భవిష్యత్తు ఉద్యమ తరానికి.. ఓ రోల్ మోడల్. ఉద్యోగులకు నష్టం కలిగిస్తున్న సమస్యలు ఏమిటనేది గుర్తించి.. వాటి పరిష్కారానికి దశలవారీ ఉద్యమాలను నిర్మించిన గొప్ప విప్లవకారుడు.. ఆ ప్రతిభ, ఆ వ్యూహ చతురత, ఆ చాణక్యానికి ఎపిఎన్‌జిఒ సంఘం గొప్ప గౌరవం ఇచ్చింది. సిక్కోలు కీర్తి బావుటాను దశదిశలా ఎగురవేసింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఇప్పటి వరకు..ఈ పదవి ఎవరికీ దక్కలేదు. దీన్ని గొప్ప అదృష్టంగా, అవకాశంగా ఉత్తరాంధ్రులు, ముఖ్యంగా శ్రీకాకుళం ప్రజలు గర్విస్తున్నారు. సొంతబిడ్డకు ఉన్నతమైన పదవి వరించటంపై హర్షాతీరేకాలు వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.



వాణిజ్యపన్నుల శాఖ అతిథిగృహ ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న చౌదరి పురుషోత్తం నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పురుషోత్తం నాయుడు.. ఉద్యమ కుటుంబం నుంచే వచ్చారు. అందుకే ఆయనకు నాయకత్వ పటిమ, ఉద్యమాలు నడిపే తీరు.. పుట్టుకతోనే వచ్చాయని ఆయన మనసెరిగిన వారు చెబుతారు. తొలితరం కమ్యూనిస్టు నాయకుడైనా.. చౌదరి తేజేశ్వరరావు కుమారుడే.. పురుషోత్తంనాయుడు. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ప్రజల హక్కుల కోసం.. నిస్వార్థంగా పనిచేసిన గొప్ప వ్యక్తి తేజేశ్వరరావు. ఆయన వారసుడిగా.. నాయుడు ఎంతో కీర్తి ప్రతిష్టలు సంపాదించారు. అతుకుల బొంతలా ఉన్న సిక్కోలు ఉద్యోగ సంఘాలను ఒకే తాటిపైకి తెచ్చారు. జిల్లా రథసారథిగా ఎన్నో ఉద్యమాలకు ఊపిరిలూదారు. అనంతరం రాష్ట్ర సంఘంలో కూడా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఎపిఎన్‌జిఒ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షునిగా నాలుగు, సహాధ్యక్షులుగా నాలుగు పర్యాయాలు కొలువుదీరారంటే.. ఆయన ప్రతిభ ఏపాటిదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇక ఉద్యోగులకు ఎటువంటి సమస్య ఉన్నా.. ఎంతో చాకచక్యంగా పరిష్కరించగల సామర్థ్యం ఆయన సొంతం. అందుకోసం ఎందాకైనా వెళ్తారు. ఎంతటి ఉన్నతాధికారినైనా కలిసి.. సమస్యను వివరించి.. ఒప్పిస్తారని పేరు. అందుకే.. ఉద్యోగులకు ఆయనంటే.. ప్రేమాభిమానాలు. ఎన్నో సంఘాలు పుట్టుకొచ్చినా.. వ్యక్తిగత విమర్శలు చేసినా.. వెరువలేదు. తన పని తాను చేసుకుపోయారు తప్ప.. విమర్శించిన వారిపై ప్రతి విమర్శలూ చేయలేదు. కేవలం పనిమీద మాత్రమే దృష్టిసారించారు. దీంతో ఏం చేయాలో పాలుపోక.. విమర్శించిన నోళ్లే తోక ముడిచాయి.

సేవాభావం మెండు..

పురుషోత్తంనాయుడిలో సేవాభావం మెండు. ఉద్యోగ సంఘం ద్వారా సేవలందిస్తూనే.. మరోవైపు ఇతర సంస్థలు, వ్యక్తిగత సమస్యలపై వెళ్లే వారిని సైతం అక్కున చేర్చుకుంటారు. తనకు తోచిన సాయం చేస్తారు. తన పరిధిలో ఉన్న సమస్యనైతే.. పరిష్కరించే వరకు నిద్రపోరు. అలా.. ఎంతోమంది అభాగ్యులు, ఆపన్నులను ఆదుకున్న గొప్ప మనసు ఆయనది. అందుకే సిక్కోలు చరిత్రలో చౌదరి కుటుంబానికి ప్రత్యేక పేరు ప్రతిష్టలు ఉన్నాయి. ఎన్నో సుగుణాల కలయిక.. పురుషోత్తముడు.. భవిష్యత్తులో మరిన్ని పదవుల్లో కొలువుదీరి, ఉద్యోగుల, ప్రజా సేవలో పునీతం కావాలని జనం కోరుకుంటున్నారు. ఆయన నియామకంపై జిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయని చెప్పడం అతిశయోక్తి కాదు. నాయుడుకు అత్యున్నత పదవి రావడంతో.. జిల్లాలోని ఉద్యోగ సంఘాల నాయకులు, అభిమానులు, రాష్ట్ర ఎండియు ఆపరేటర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆ సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రౌతు సూర్యనారాయణ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

ఉద్యోగుల వైద్యానికి చేదోడు

కారుణ్య నియామకాల్లో సహకారం ● వ్యక్తిగత సమస్యల పట్ల తోడ్పాటు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉత్తరాంధ్ర నుంచి మొట్టమొదట సారి ఎన్నికైన ఏకైక వ్యక్తి చౌదరి పురుషోత్తం నాయుడు. ఆయన జిల్లాకు చెందిన వ్యక్తి. గతంలో జిల్లా సంఘానికి అధ్యక్షునిగా , ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. ఆ తర్వాత రాష్ట్ర బాధ్యతల్లో అంచలంచెలుగా ఎదిగిన ఆయన చెరో నాలుగు సార్లు సహాధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా పనిచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతలను భుజానికి ఎత్తుకున్నారు. వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగిగా పని చేస్తున్న ఆయన ఉద్యోగుల సమస్యల పట్ల సుదీర్ఘ కాలంగా అనేక పోరాటాల్లో చురుగ్గా వ్యవహరిస్తూ ఎపి ఎన్‌జిఒ సంఘాన్ని పటిష్ట పరచడానికి ఎంతో సమర్థవంతంగా పనిచేస్తున్నారు. జిల్లాలోనే కాక రాష్ట్ర బాధ్యతల్లో ఎనిమిది సార్లు వివిధ హోదాల్లో పని చేశారు. ప్రస్తుతం ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలతో పాటు ఉద్యోగుల వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి తనదైన శైలిలో పురుషోత్తం నాయుడు కృషి చేస్తున్నారు. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగులకు రూ.లక్షలాది గా ప్రభుత్వ నిధులతో చికిత్సను అందించడంలో ఆయన సేవలు ప్రశంసనీయమైనవి. కిడ్నీ, లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్ వంటి ఖరీదైన శస్త్రచికిత్సలకు కూడా ప్రభుత్వం తరపునుండి నిధులు మంజూరు చేయడంలో ప్రముఖపాత్ర పోషించారు. కారుణ్య నియామకాల్లో ఎటువంటి పైరవీలకు తావివ్వకుండా, బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికప్రయోజనంతో పాటు కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు ఉన్నతాధికారులపై ఒత్తిడి పెంచి ఉద్యోగాలు ఇప్పించడంలో కీలకంగా వ్యహరించారు. కోవిడ్ సమయంలో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు సంఘం తరపున ఆయన అండగా నిలిచారు.



జాతీయ సదస్సులో పాల్గొన్న ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకుల బృందం



అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు బండితో పురుషోత్తంనాయుడు

ముందున్న సవాళ్లు

రాష్ట్రంలో ఉద్యోగులంతా 12వ పిఆర్‌సి కోసం ఎదురు చూస్తున్నారు. పిఆర్‌సి కమిటీతోపాటు ఐఆర్‌ను ప్రభుత్వం నుంచి ఇప్పించడంలో కీలకంగా వ్యవహరించాల్సి ఉంది. దీనిపై ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి రూ.వేల కోట్లు ఆర్థిక బకాయిలు రావాల్సి ఉంది. ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో అందడం లేదన్న అసంతృప్తి ఉద్యోగుల్లో ఉంది. దీనిపై కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ఉపాధ్యాయ, ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ సాధించడంలో కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. రూ.18 కోట్ల పెండింగ్ బకాయిలు, సరెండర్ లీవ్, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, డిఎలు, గత, పిఆర్‌సిలో లోపాలను సరిదిద్దడంలో ప్రభుత్వంపై వత్తిడి చేయడంలో కీలకంగా వ్యవహరించే బాధ్యతలను నిర్వర్తించాలి. ఉద్యోగుల్లో గత ఉద్యమాల వల్ల సన్నగిల్లిన నమ్మకాన్ని తిరిగి పునరుద్ధరించడంలో ఆయన బాధ్యత కీలకం కానుంది.

రక్తదానంపై అవగాహన అవసరం




ప్రజాశక్తి - శ్రీకాకుళం

చిన్నదెబ్బ తగిలినా చిటుక్కున బయటకు తొంగిచూస్తుండే రక్తం విలువను నేటికీ మనం పూర్తిగా గుర్తించడం లేదు. ఇప్పటివరకు రక్తానికి పూర్తిస్థాయి ప్రత్యామ్నాయం లేదు. మన ఆస్తిత్వానికి అత్యంత ఆవశ్యకమై నది రక్తమే. రక్తాన్ని ఉత్పత్తి చేసే శక్తి, సామర్థ్యం కేవలం మన దేహానికి మాత్రమే ఉంది. ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర పరిస్థితులను నెగ్గుకు రావాలంటే రక్తదానం ఒక్కటే మార్గం. నేడు ఆస్పత్రులకు వస్తున్న ప్రతీ పది మందిలో కనీసం ఒకరికి రక్తం ఎక్కించాల్సిన అవసరం ఉంటోంది. రక్తం ఆవశ్యకతను, ప్రాముఖ్యాన్ని మనం గుర్తిం చాల్సిన అవసరం ఉంది. రక్తదానంపై రకరకాల అపోహలు, అపనమ్మకాలు పేరుకు పోయాయి. ఈ నేపథ్యంలో రక్తదానంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎటువంటి ఇబ్బందీ ఉండదు

రక్తం తీసేటప్పుడు చాలా బాధగా ఉంటుందన్న భయం చాలా మందిలో ఉంది. కానీ వాస్తవంగా రక్తం తీసేటప్పుడు నొప్పి ఉండదు. మొదట సూది గుచ్చేటప్పుడు స్వల్పంగా మంటగా ఉండే అవకాశం ఉంది. ఆ తర్వాత ఎటువంటి బాధా ఉండదు. పైగా దీనికి ఉపయోగించే సూదులన్నీ పూర్తిగా స్టెరిలైజ్ చేసినవి, సురక్షితమైనవే. అందువల్ల ఇతరత్రా ఇబ్బందులు సంక్రమిస్తాయేమోనని ఆందోళన చెందాల్సిన పనిలేదు.



రక్తదానానికి ముందు, తర్వాత

రక్తదానం చేసే రోజున మామూలుగా ఎప్పటిలాగే ఆహారం తీసుకోవాలి. రక్తాన్ని తీసుకోవటానికి ముందు డాక్టర్లు మన వ్యక్తి గత సమాచారం అడిగి తెలుసుకుంటారు. మన ఆరోగ్య పరిస్థితిని అర్థం చేసుకునేందుకు నాడి చూస్తారు. రక్తపోటు, శరీర ఉష్ణోగ్రత, రక్తంలో హిమోగ్లోబిన్ శాతం కొలుస్తారు. మనం ఏవైనా మందులు వాడినా, వాడుతున్నా డాక్టర్లకు చెప్పాలి. అన్నీ పరీక్షించిన తరువాతే రక్తం తీసుకుంటారు. రక్తం ఇచ్చిన అనంతరం కొద్దిసేపు అక్కడే విశ్రాంతి తీసుకోవచ్చు. ఆ తర్వాత 24 గంటల పాటు నీరు. పళ్లరసాల వంటి ద్రవాలు ఎక్కువగా తీసుకోవటం మంచిది. గంటసేపు వాహనం నడపకూడదు. ఖాళీ కడుపుతోగానీ, కడుపునిండా తినిగానీ వెంటనే రక్తం ఇవ్వకూడదు. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగి 45 కిలోల బరువున్న ఆరోగ్యవంతులు ఎవరైనా రక్తాన్ని దానం చేయవచ్చు. మధుమేహం, గుండె జబ్బులు వంటివి లేనివారు, రక్తపోటు సాధారణంగా ఉన్నవారు రక్తదానం చేయవచ్చు. ఆరోగ్యవంతులు కూడా ఫ్లూజ్వరం వంటి సమస్యలు లేని రోజుల్లో రక్తదానం చేయాలి. మరీ ముఖ్యంగా ఆస్పిరిన్ సంబంధిత మందులేవి తీసుకోకూడదు. ఒక సారి రక్తదనం చేసినవారు తిరిగి మూడు నెలలకు మళ్లీ రక్తం ఇవ్వొచ్చు.

ఎవరు చేయకూడదు...

హెపటైటిస్(బి, ఎ, సి)తో బాధపడిన వారు రక్తదానం చేయకూడదు. వీరి రక్తం ద్వారా హెపటైటిస్ వైరస్ ఇతరులకు కూడా సోకే అవకాశం ఉంది. అలాగే ముందు జాగ్రత్త చర్యగా హెపటైటిస్ వ్యాధితో బాధపడిన వ్యక్తి సన్నిహితులు కూడా ఏడాది పాటు రక్తం ఇవ్వకుండా ఉంటే మంచిది. సిఫిలిస్, గనేరియా వంటి సుఖ వ్యాధులున్న వారు రక్తదానం చేయకూడదు. మలేరియా వ్యాధి రక్తం ద్వారా సంక్రమించే ఆవకాశం ఉంది. అందువల్ల మలేరియా చికిత్స చేయించుకున్న వారు వ్యాధి తగ్గిన తర్వాత కూడా మూడు నెలల పాటు రక్తదానం చేయకూడదు. హెచ్ఐవి పాజిటివ్ (ఎయిడ్స్) ఉన్న వారు, ఎక్కువ మందితో లైంగిక సంబంధాలు ఉన్న వారు, స్వలింగ సంపర్కులు, మాదక ద్రవ్యాలు సేవించేవారు, సెక్స్ వర్కర్లు రక్తదానం చేయకూడదు.



ఎంత రక్తం తీసుకుంటారు?

ఆరోగ్యవంతుడైన వ్యక్తి శరీరంలో 5 నుంచి 6 లీటర్ల రక్తం ఉంటుంది. సాధారణంగా రక్తదానం చేసేటప్పుడు దాత బరువును బట్టి 300మిల్లీ లీటర్ల నుంచి 400మిల్లీలీటర్లు మాత్రమే తీస్తారు. రక్తదానం చేసినప్పుడు మన నుంచి తీసేది మన శరీరంలోని మొత్తం రక్తంలో 8శాతం మాత్రమే. ఎంత రక్తాన్ని దానం చేస్తామో అదంతా దరిదాపుగా వెంటనే మన శరీరం సమకూర్చుకుంటుంది. మొత్తంమీద 24 నుంచి 76 గంటల్లో మన శరీరంలో రక్తం తిరిగి పూర్తి స్థాయికి వచ్చేస్తుంది. ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చు. రక్తదానం చేసేందుకు ఇప్పటివరకు మన దేశంలో పురుషులే ఎక్కువగా ముందుకు వస్తున్నారు. స్త్రీల విషయంలో ఇప్పటికీ మందకొడితనం నెలకొంది. రక్తదానం చేయడం వల్ల స్త్రీలు ఎటువంటి సమస్యలూ ఎదుర్కొవాల్సిన అవసరం ఉండదు. పైగా పురుషులతో పోల్చుకుంటే చాలా విషయాల్లో స్త్రీల రక్తం సురక్షితంగా ఉండే అవకాశం ఎక్కువని డాక్టర్లు స్పష్టం చేస్తున్నారు. ఇతరత్రా ఇబ్బందులేమీ లేకపోతే స్త్రీలు-నెలసరి సమయంలో, బిడ్డకు పాలిస్తున్నప్పుడు, గర్భవతిగా ఉన్నప్పుడు తప్పించి మిగతా సమయాల్లో ఎప్పుడైనా నిశ్చింతగా రక్తదానం చేయవచ్చు.



కేన్సర్ సంకేతాలు - జాగ్రత్తలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం


మన శరీరంలో కణాలు అసాధారణంగా, అదుపులో లేనివిధంగా రెట్టింపవుతూ పెరిగిపోవడం కేన్సర్ లక్షణం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) లెక్కల ప్రకారం కొత్తగా నిర్ధారణ అవుతున్న కేన్సర్ కేసులు, కేన్సర్ మరణాలు 2020 సంవత్సరానికి గుండె జబ్బు వల్ల మరణాలు కంటే ఎక్కువ ఉంటాయని అంచనా. కేన్సర్ అన్ని వయస్సులలో వారికి రావచ్చు. పిల్లలలో వచ్చే కేన్సర్ రకాలు పెద్ద వారితో పోలిస్తే పూర్తిగా నయమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటుంది. కేన్సర్ కారణాలు పలు రకాలుగా ఉండొచ్చు. అవి జన్యుపరమైనటువంటి పలు రకాలుగా ఉండొచ్చు. అవి జన్యుపరమైనటువంటి లేదా పర్యావరణానికి సంబంధినవైనా లేక మన అలవాటు పొగాకు, మద్యం ఆహారపు అలవాట్ల వలన ఉండొచ్చు. కేన్సర్‌ను ముందుగానే సూచించే సంకేతాలను తెలుసుకోవడం వలన వ్యాధిని తొలిదశలోనే గుర్తించొచ్చు.

కేన్సర్ సంకేతాలు

విరేచనంలో, మూత్రంలో మార్పులు, మానని పుండు, అకారణ రక్తస్రావం, డిశ్చార్జి, రొమ్ములో కణితి మరెక్కడైనా కణుతులు, అరుగుదల లేకపోవడం, మింగడంలో కష్టం, పుట్టుమచ్చలో మార్పు, విడవకుండా వచ్చే దగ్గు, గొంతులో మార్పు.

కేన్సర్ లక్షణాలు లేనప్పుడు కూడా కొన్ని పరీక్షల ద్వారా కేన్సర్ ను గుర్తించొచ్చు. వీటిని స్క్రీనింగ్ పరీక్షలు అంటారు. పాశ్చాత్య దేశాలలో వీటి ద్వారా చాలా రకాల కేన్సర్లను తొలి దశలో గుర్తించి వైద్యం అందిస్తున్నారు. గర్భాశయ ముఖ ద్వారా కేన్సర్‌కు పాప్ స్మియర్ పరీక్ష, రొమ్ము కేన్సర్‌కు మాదోగ్రఫీ పరీక్ష వంటివి ఈ రకమైనవి. కేన్సర్‌ను నాలుగు దశలుగా గుర్తిస్తారు. నేడు శాస్త్ర సాంకేతిక రంగాలలో వచ్చిన మార్పు దృష్ట్యా అన్ని దశలలో ఉన్న వ్యాధిగ్రస్తులకు మెరుగైన చికిత్స, జీవ పరిమాణం లభిస్తున్నాయి. శస్త్ర చికిత్సలో మార్పులు, రేడియేషన్ వైద్య విధానంలో వచ్చిన మార్పులు, కీమోథెరపీలో నూతన పద్ధతులు ఎంతోమంది రోగులకు నూతన జీవితాలను ప్రసాదిస్తున్నాయి. కేన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చు.

పింపుల్స్ పీడిస్తున్నాయా..?



ప్రజాశక్తి - శ్రీకాకుళం

సాధారణంగా యుక్తవయసు వచ్చిన యువతీ,యువకుల్లో కొవ్వు పదార్థాం చేరిన చిన్న, చిన్న మొటిమలు ముఖంపై ఎక్కువగా, ఛాతి, వీపులపై తక్కువగా రావడం జరుగుతుంది. ఇలా యుక్త వయస్సులో మొటిమలు రావడం సహజమే. అయినప్పటికీ మొటిమలు ఏర్పడగానే తాము అందవిహీనులవుతున్నామని వారు భావిస్తారు. అంతేకాకుండా, మార్కెట్‌లో లభించే రకరకాల క్రీమలును, లోషన్‌లను రాసుకోవడం, మొటిమలను గిల్లడం మొదలైనవి చేయడం వల్ల మొటిమలు తగ్గకపోగా, ఇన్‌ఫెక్షన్‌కు గురై, చీము కారడం, మచ్చలు ఏర్పడటం, గుంటలు పడటం జరుగుతుంది. మొటిమలు 12 సంవత్సరాల వయస్సు నుంచి 24 ఏళ్లలోపు వారికి వస్తుంటాయి. కానీ కొందరిలో హార్మోన్లు అసమతుల్యత వల్ల తీవ్రమైన మానసిక ఒత్తిడి వల్ల స్త్రీలలో బహిష్టులు సక్రమంగా లేకపోవడం వల్ల కొన్ని రకాల మందుల దుష్ప్రభావాల వల్ల వయస్సుతో నిమిత్తం లేకుండా ఇవి వస్తుంటాయి.

నివారణకు జాగ్రత్తలు


- మొదటగా మొటిమలను గిల్లడం, గిచ్చడం చేయ కూడదు.
- గోరువెచ్చని నీటితో రోజుకు 4 నుంచి 6 సార్లు శుభ్రపరచుకోవాలి.
- సున్నిపిండితో ముఖాన్ని శుభ్రం చేసుకోడం చాలా మంచిది.
- ఫాస్ట్ ఫుడ్స్, ఆయిల్ ఫుడ్స్, స్వీట్స్, నిలువ ఉన్న ఆహార పదార్థాలు తినకూడదు.
- ప్రకృతి సిద్ధమైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలి. మొలకెత్తిన విత్తనాలను, ఆకుకూరలు, పండ్లు, కాయగూరలు మొదలైనవి ఎక్కువగా తీసుకోవాలి.
- మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి.


ఉద్యోగ రథసారధికి స్వాగత శుభాకాంక్షలు
కామ్రేడ్ చౌదరి పురుషోత్తం నాయుడు గారు
APNGGO రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన శుభసందర్భంగా..
వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు
పి. వేణు గోపాలరావు
తహశీల్దార్,
State vice president APRSA
కామ్రేడ్ చౌదరి పురుషోత్తం నాయుడు గారు
APNGGO అసోసియేషన్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
నిర్మల - తన్మయి - గురుచరణ్


ఉద్యోగ రథసారధికి శుభాకాంక్షలు
కామ్రేడ్ చౌదరి పురుషోత్తం నాయుడు గారు
APNGGO
రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా
ఎన్నికైన శుభసందర్భంగా.. వారికి నా
హృదయపూర్వక
శుభాకాంక్షలు
కిల్లి కిషోర్ కుమార్ (చిన్ని)
అధ్యక్షులు,
శ్రీకాకుళం జిల్లా ఫ్లెక్స్ ప్రింటర్స్ అసోసియేషన్.
కామ్రేడ్ చౌదరి పురుషోత్తం నాయుడు గారు
APNGGO అసోసియేషన్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
అయ్యప్ప చిన్నీస్ ఫ్లెక్స్ జోన్
జి.టి. రోడ్, శ్రీకాకుళం.


ఉద్యోగ రథసారధికి శుభాకాంక్షలు
కామ్రేడ్ చౌదరి పురుషోత్తం నాయుడు గారు
APNGGO
రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన శుభసందర్భంగా..
వారికి నాహృదయపూర్వక శుభాకాంక్షలు
PUJARI VENKATA RAMANA
School Asst. (Social studies),
Z.P.H.S, ALLADA.
కామ్రేడ్ చౌదరి పురుషోత్తం నాయుడు గారు
APNGGO
అసోసియేషన్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
P. VIJAYALAKSHMI
EO (PR &RD),
BURJA MANDAL


స్వాగతం... సుస్వాగతం
సరైన నాయకునికి..
సరైన పదవి..
కామ్రేడ్ చౌదరి పురుషోత్తం నాయుడు గారు
APNGGO రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా
ఎన్నికైన శుభసందర్భంగా.. వారికి నా
హృదయపూర్వక శుభాకాంక్షలు
కామ్రేడ్ చౌదరి పురుషోత్తం నాయుడు గారు
APNGGO అసోసియేషన్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
నూక సన్యాసిరావు
డైరెక్టర్ ఆర్ట్స్, శ్రీకాకుళం.


సరైన నాయకునికి..
సరైన పదవి..
ఉద్యోగ రథసారధికి శుభాకాంక్షలు
స్వాగతం...! సుస్వాగతం..!
ఎన్జీఓ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన
కామ్రేడ్ కె.వి. శివారెడ్డి గారు...
నిరంతర ఉద్యమ మార్గ నిర్దేశకులు, నిత్య ఉద్యమ స్ఫూర్తి అయిన
కామ్రేడ్ చౌదరి పురుషోత్తం నాయుడు గారు
ఎన్జీఓ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భాధ్యతలు స్వీకరించి
నేడు శ్రీకాకుళం జిల్లాకు విచ్చేయుచున్న శుభసందర్భంగా.. వారికి
మా హృదయపూర్వక శుభాకాంక్షలు
కామ్రేడ్ కె.వి. శివారెడ్డి గారు
APNGGO
అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు
కామ్రేడ్ హనుమంతు సాయిరాం
జిల్లా అధ్యక్షులు మరియు JAC ఛైర్మన్
కామ్రేడ్ చల్లా శ్రీనివాసరావు
జిల్లా కార్యదర్శి
కామ్రేడ్ కంఠ జయరావ్
జిల్లా సహాధ్యక్షులు
కామ్రేడ్ బిడగల పూర్ణచంద్రరావు
జిల్లా కోశాధికారి
కామ్రేడ్ ఆర్.గోవింద పట్నాయక్
జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి
కామ్రేడ్ కాయల శ్రీనివాసరావు
జిల్లా ఉపాధ్యక్షులు
కామ్రేడ్ రాయి వేణుగోపాల్
జిల్లా ఉపాధ్యక్షులు
కామ్రేడ్ పూజారి జానకిరామ్
జిల్లా ఉపాధ్యక్షులు
కామ్రేడ్ టి. సోమేశ్వరరావు
జిల్లా ఉపాధ్యక్షులు
కామ్రేడ్ చౌదరి పురుషోత్తం నాయుడు గారు
APNGGO
అసోసియేషన్
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
కామ్రేడ్ డి.శ్రీరామ్
జిల్లా ఉపాధ్యక్షులు
కామ్రేడ్ డి. శశిభూషణరావు
జిల్లా ఉపాధ్యక్షులు
కామ్రేడ్ కె. రోజా కుమారి
జిల్లా జాయింట్ సెక్రటరీ
కామ్రేడ్ డి.రాజ్ కుమార్
జిల్లా జాయింట్ సెక్రటరీ
కామ్రేడ్ ఎ.జె.యం. రాధాకృష్ణ
జిల్లా జాయింట్ సెక్రటరీ
కామ్రేడ్ డి.అప్పన్న
జిల్లా జాయింట్ సెక్రటరీ
కామ్రేడ్ జి.రత్న కుమార్
జిల్లా జాయింట్ సెక్రటరీ
కామ్రేడ్ బి. భాస్కరప్రసాద్
జిల్లా జాయింట్ సెక్రటరీ
ఎ.పి.ఎన్.జి.జి.ఒ. అసోసియేషన్ - శ్రీకాకుళం జిల్లా